

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక



శుక్రవారం | 30-10- 2026 | సంపుటి: 17, సంచిక: 209, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి..


పూర్తి భద్రత కల్పిస్తాం

రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అడ్డంకులు తొలగిస్తాం

ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీపడాలి

తెలంగాణలో పెట్టుబడులు పెడితే నేనే సంరక్షకుడిగా ఉంటా

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 29 (ప్రజాకలం) : తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని.. పారిశ్రామికవేత్తలకు పూర్తి భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అడ్డంకులు తొలగిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీపడాలని ఆకాంక్షించారు. తెలంగా ణలో పెట్టుబడులు పెడితే తానే సంరక్షకుడిగా ఉంటానని భరోసా కల్పించారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -2026 కర్టెన్ రైజర్ కార్యక్రమం లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, అధికారులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారు.

ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలి..

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిం చారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. సుమారు 400 ఏళ్ల క్రితమే హైదరాబాద్ ఒక ప్రపంచస్థాయి నగరంగా వెలిగిందని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అనేక దేశాల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌లోని చార్మినార్ పరిసరాలకు వచ్చి వ్యాపారాలు చేసేవారని ప్రస్తావించారు. నిజాం పాలకులు అద్భుతమైన కట్టడాలు, ప్రపంచస్థాయి మ్యూజియం, టంకశాల (నాణేల ముద్రణాల యం), విమానాశ్రయం, రైల్వేలు, అత్యుత్తమ విద్యాసంస్థలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని వెల్లడించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రపంచం గర్వించే మేధో నిపుణులు,

తరువాయి 2వ పేజీలో...



ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి

ప్రత్యేక కార్యాచరణ

సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా లక్షిత వర్గాలకే వినియోగించాలి

అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందాలి

ఆవాసాల్లో మౌలిక సదుపాయాలు.. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ

అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దిశానిర్దేశం

హైదరాబాద్, అక్టోబరు 29 (ప్రజాకలం) :

ఎస్సీ, ఎస్టీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన ప్రత్యేక అభివృద్ధి నిధులను సమర్థవంతంగా వినియోగించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇరువురు మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్దేశిత లక్ష్యాలకు మాత్రమే వినియోగించేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం వ్యవసా యం, ఇంధనం, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక తదితర శాఖల్లో ఎస్సీ,

తరువాయి 2వ పేజీలో...

నీటి బొట్టును కాపాడుదాం..

ప్రకృతిని పరిరక్షిద్దాం..

భవిష్యత్తు తరాలకు నీటి భరోసా కల్పిద్దాం!

- నీటి సంరక్షణ మనందరి బాధ్యత.. నేటి నుంచే ఆచరిద్దాం!
- ఎల్‌నినో ప్రభావానికి ముందస్తు జాగ్రత్తలు అవసరం.. నీటి సంరక్షణ అందరి బాధ్యత
- నీరు ఉంటేనే జీవనం.. నీరు ఉంటేనే భవిష్యత్తు!



జగిత్యాల్ ప్రతినిధి అక్టోబర్ 29 (ప్రజా కలం) నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద. మనిషి మనుగడకు, వ్యవసాయానికి, పశుపోషణకు, పరిశ్రమలకు నీరే ఆధారం. అలాంటి నీటిని విలువైన వనరుగా భావించాల్సిన మనం, నిర్లక్ష్యంతో వృథా చేస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

తరువాయి 2వ పేజీలో...

పల్లెల్లో గుప్పుమంటున్న గుడుంబా

తండాల నుంచి పట్టణాల వరకు జోరుగా రవాణా

నిషేధిత గుడుంబా పై నిఘా కరువు - మామూళ్ళ మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 29 :
(ప్రజా కలం ప్రతినిధి)

మండలంలో గుప్పు మంటున్న గుడుంబా తండాల నుంచి పట్టణాల వరకు జోరుగా రవాణా మామూళ్ల మత్తులో అధికారుల అలసత్వంతో గుడుంబా జోరు ఇందు గలదు అందులేదు అనే సందేహం వలదు గుడుంబా ఎందెందు చూసినా అందులోనే గలదు సారమ్మ సారో సారా ఎందెందు వెతికిన అందందు గలదు నాటు సారా ఇబ్రహీంపట్నం మండలంలో పల్లెలు, మారుమూల తండాల్లో మళ్ళీ నాటు సారా గుప్పుమంటోంది కొన్ని సంవత్సరాలుగా స్తబ్దంగా ఉన్న సారా మహమ్మారి తయారీ మళ్ళీ పల్లెల్లో పుంజుకుంది. మండలంలో నాటు సారా తయారీ దారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ నాటు సార దంద నిర్వహిస్తున్నారు. మధ్యం ధరలు విపరీతంగా పెరగడంతో పేద,మధ్యతరగతి ప్రజ లు నాటు సారా వైపు మొగ్గుతున్నట్లు తెలుస్తోంది. మామూళ్ళ మత్తులో సంబంధిత శాఖ

నాటు సారాను నిరో ధించాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు గుడుంబా నియంత్రణ మూలాల పై దృష్టి పెట్టకుండా అడపాదడప దాడులు చేస్తూ మామూళ్ళ మత్తులో జోగుతూ అమ్మకం దారులకు కొమ్ము కాస్తూ అండగా నిలిస్తున్నారన విమర్శలు వస్తునానయి. దీంతో మూడు పూలు ఆరు కాయలుగా నాటు సారా తయారీ కేంద్రాలు విచ్చలవిడిగా కొనసాగు తున్నాయి. గతంలో నాటు సారా తయారు చేసేవాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం కల్పిస్తూ పలు పథకాలను అమలు చేసింది. అయినప్పటికీ కొందురు గుడుంబా కాయ దమే వృత్తిగా పెట్టుకుని పల్లెలో, తండాల్లో జోరుగా నాటు సారా దందాను సాగిస్తున్నారు. గుడుంబా కేవలం పల్లెలు, తండాలకే పరిమితం కాకుండా ఇప్పుడు పట్టణాలకు సైతం పాకింది. జోరుగా నాటు సారా తయారీ ఇబ్రహీంపట్నం మండలం లో నాటుసారా తయారీ జోరందుకుంది. మధ్యం



ధరలు ఎక్కువగా ఉండడం తో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు తక్కువ ధరలో లభించే నాటు సారా (గుడుంబా) వైపు

తరువాయి 2వ పేజీలో...

నిమ్స్, ఉస్మానియా నిర్మాణ పనులు

వేగవంతం చేయాలి


మంత్రి రాజనర్సింహా



హైదరాబాద్, అక్టోబరు 29 (ప్రజాకలం) : నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత

ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా
- క్రీడాకారులకు ప్రపంచస్థాయి సదుపాయాలు కల్పించాలి..
- ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలి
- ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని కోరిన మంత్రి వాకిటి శ్రీహరి



న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా గేమ్స్ విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాతో న్యూఢిల్లీలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని, రాష్ట్రంలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు

తరువాయి 2వ పేజీలో...

ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను

భాగస్వామ్యం చేయండి

"ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026" కర్టెన్ రైజర్ లో మంత్రి శ్రీధర్ బాబు



న్యూఢిల్లీ : సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్) 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఫలితంగా... ఫ్యాబ్ ఇండస్ట్రీ, చిప్ డిజైన్ విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా ఎదిగేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఢిల్లీలో నిర్వహించిన "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026" కర్టెన్ రైజర్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర డిఫెన్స్ ఎగుమతులు గతంతో పోలిస్తే 103 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 నాటికి 5 గిగావాట్లకు చేర్చేందుకు ప్రణాళికాబ ద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే సంకల్పంతోనే గతేడాది "తెలంగాణ రైజింగ్" విజన్ కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర పారిశ్రామికా భివృద్ధికి ఊతమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పరి శ్రమల ఏర్పాటు, పెట్టుబడులకున్న అనుకూలతల ను వివరించి పారిశ్రామికవేత్తలను "రైజింగ్ తెలంగాణ విజన్ లో భాగస్వామ్యం చేసేందుకే ఢిల్లీలో "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026" కర్టెన్ రైజర్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ 2.0 లో పాల్గొనాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలను కోరారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. పూర్తి భద్రత కల్పిస్తాం

మొదటి పేజీ తరువాయి...

నాయకులను అందించిందని చెప్పుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ప్రేమ్ వత్స వంటి ప్రముఖులంతా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారని ప్రస్తావించారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను తయారు చేయడంలో హైదరాబాద్‌కు ప్రత్యేకత ఉందని వివరించారు.

అంచనాలను రెట్టింపు చేయండి..

'1991 నుంచి హైదరాబాద్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నప్పటికీ, హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి అంతా మద్దతుగా నిలిచారు. వ్యాపార రంగం గురించి మాకంటే మీకే ఎక్కువగా అవగాహన ఉంది. మీ నుంచి నేర్చుకుంటాం, మీ అభిప్రాయాలను అర్థం చేసుకుంటాం, వాటిని ఆచరణలో పెడతాం. తెలంగాణలో మీరు పెట్టే పెట్టుబడులకు భద్రత కల్పించడం, అవి వృద్ధి చెందేలా చూడటం నా బాధ్యత. మీరు ఆశిస్తున్న వృద్ధి అంచనాలను రెట్టింపు చేయండి. మీకు ఏం కావాలో చెప్పండి. విధానపరమైన నిర్ణయాలైనా, ప్రభుత్వ సహకారమైనా, మీకు అవసరమైన మద్దతు అందించే బాధ్యతను నేను తీసుకుంటా. 'తెలంగాణ రైజింగ్ 2047' రాష్ట్ర భవిష్యత్ ప్రణాళిక. ఇది 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా ఉంది. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలి. ప్రస్తుతం దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతంగా ఉంది. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

కేంద్రం తెలంగాణకు సహకరిస్తోంది..

'పెట్టుబడిదారుల్లో చాలామందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలపై సందేహాలున్నాయి. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో మూడు హైదరాబాద్‌కు అనుసంధానం కానున్నాయి. హైదరాబాద్ – చెన్నై, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – పుణె మార్గాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం ద్వారా కూడా కేంద్రం తెలంగాణకు సహకరిస్తోంది. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి మెట్రో రైలు విస్తరణ వరకు, నేవీ రాడార్ కేంద్రం నుంచి అనేక ఇతర అభివృద్ధి కార్యక్రమాల వరకు కేంద్రం నుంచి సహకారం పొందుతున్నాం. అభివృద్ధి విషయంలో ప్రభుత్వ జోక్యం కంటే, అవసరమైన చోట ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి అవకాశాలను విస్తరించాలి. మీ విజయపథంలో ఉన్న అడ్డంకులను తొలగిస్తాం. హైదరాబాద్ ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలతో పోటీ పడదు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి. తెలంగాణ అభివృద్ధికి మీ అత్యుత్తమ ఆలోచనలను అందించండి. మీ సూచనలను పరిశీలించి, వాటిని ప్రభుత్వ విధానాలుగా అమలు చేస్తాం. తెలంగాణ ఎదుగుతోందని.. ఈ ప్రగతి ప్రస్థానంలో మీరూ భాగస్వాములు కండి. మనమంతా కలిసి ఎదుగుతూ చరిత్ర సృష్టిద్దాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి ఏం చెప్పారంటే..

వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు భారతీయులందరూ కలిసి పనిచేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 కర్టెన్ రైజర్ కార్యక్రమం ఢిల్లీ వేదికగా ఘనంగా జరుగుతోంది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, పలువురు పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం దసరా, కర్వా చౌత్, దీపావళి పండుగల రోజులు నడుస్తున్నాయని అన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026తో మరో పండుగ వచ్చిందని పేర్కొన్నారు. 700 ఏళ్ల క్రితమే కాకతీయ గణపతి చక్రవర్తి నౌకా వాణిజ్యంపై మోటుపల్లి శాసనం వేయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. నాడే వ్యాపారులు తమ పెట్టుబడులకు భద్రత, విధాన నిర్ణయాల్లో స్థిరత్వాన్ని కోరుకున్నారని చెప్పుకొచ్చారు. ఇప్పుడు పారిశ్రామికవేత్తలూ అవే కోరుకుంటున్నారని పీయూష్ గోయల్ వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ప్రపంచంలోని మొదటి ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని కేంద్ర మంత్రి ప్రశంసించారు. ఊహించిన దానికంటే దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి సాధిస్తోందని తెలిపారు. ప్రస్తుతం మధ్య ఆసియా సంక్షోభం వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, సంప్రదాయ అంచనాలు, ఊహాలను అధిగమించి ఎగుమతులను పెంచామని వెల్లడించారు. మరోవైపు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని సీఎం రేవంత్ పెట్టుకోవడాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్వాగతించారు.

నిమ్స్, ఉస్మానియా నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులో 80 శాతం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. ఈ మేరకు రెండు కీలక ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి వైద్య, ఆరోగ్య శాఖ సహా సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, శాఖల మధ్య సమన్వయంతో నిర్మాణ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పనుల్లో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆజ్ఞాపించారు. మరోవైపు, ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రి ప్రాజెక్టులను చేపట్టినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

నీటి బొట్టును కాపాడుదాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం..

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, నీటి లభ్యతలో హెచ్చుతగ్గులు సంభవించే అవకాశాల నేపథ్యంలో ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ముందస్తు జాగ్రత్తలే మనకు రక్షణ

వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, చెరువులు, కుంటలు, బావులు ఎప్పుడూ నీటితో నిండే ఉంటాయని భావించడం పొరపాటు. ప్రకృతి పరిస్థితులు ఎప్పుడు ఎలా మారుతాయో చెప్పలేం. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే తాగునీటితో పాటు సాగునీటి కొరత కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం ఉంది. అందుకే నీరు సమృద్ధిగా ఉన్నప్పుడే దాని విలువను గుర్తించి, పొదుపుగా వినియోగించడం అలవాటు చేసుకోవాలి.

ప్రతి నీటి బొట్టూ విలువైనదే!

ఇళ్లలో కుళాయిలను అవసరం లేకుండా తెరిచి ఉంచడం, ట్యాంకులు నిండిన తర్వాత కూడా నీరు పొంగిపోవడం, వాహనాల శుభ్రతకు అధికంగా నీటిని వినియోగించడం, పైపుల లీకేజీలను నిర్లక్ష్యం చేయడం వంటి చిన్నచిన్న అలవాట్ల వల్ల పెద్ద మొత్తంలో నీరు వృథా అవుతోంది. ఈఅలవాట్లను మార్చు కుంటే నీటివృథాను గణనీయంగా తగ్గించవచ్చు.

కుళాయిలు, పైపుల లీకేజీలను వెంటనే అరికట్టాలి.

అవసరమైనంత నీటినే వినియోగించాలి. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టాలి. చెరువులు, కుంటలు, కాలువలను సంరక్షించాలి. వ్యవసాయంలో నీటిని పొదుపు చేసే సాగు పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చూడాలి.

రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నీటి కొరత ఏర్పడితే అత్యధిక ప్రభావం వ్యవసాయ రంగంపై పడే అవకాశం ఉంది. అందువల్ల రైతులు అందుబాటులో ఉన్న నీటిని దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక, సాగు ప్రణాళికలను రూపొందించుకోవాలి. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి పద్ధతులపై దృష్టి సారించాలి. ప్రభుత్వ శాఖలు సైతం నీటి వనరుల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, ప్రజల్లో అవగాహన పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

నిర్లక్ష్యం చేస్తే.. కష్టాలు తప్పవు!

నీటి కొరత ఏర్పడిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, సమస్య రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం మేలు. ఈరోజు మనం వృథా చేస్తున్న నీరే రేపు మనకు అవసరమైనప్పుడు అందుబాటులో లేకపోవచ్చు. నీటి వృథా వల్ల కలిగే నష్టాన్ని గుర్తించకపోతే భవిష్యత్తులో తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితులు రావచ్చు. నీటి సంరక్షణ అనేది ఒక్క ప్రభుత్వ శాఖ బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. ఇంటి నుంచి గ్రామం వరకు, పట్టణం నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు ప్రతి ఒక్కరూ నీటి పొదుపును తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి.

నేటి పొదుపే.. రేపటి భరోసా!

ఎల్‌నినో ప్రభావం ఎలా ఉన్నా, నీటి వినియోగంలో నిర్లక్ష్యం మాత్రం మనకు మరింత నష్టం కలిగించకూడదు. నీటిని వృథా చేయకుండా వినియోగించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను కాపాడటం ద్వారా రాబోయే తరాలకు నీటి భద్రత కల్పించవచ్చు.

నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి కష్టాలను తగ్గించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి..నీటి సంరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదు.. ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత సమస్యలు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలను ఇప్పటి నుంచే అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని మేధావులు, విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ నీటి పొదుపుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరుతున్నారు. నీటిని వృథా చేయడం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను ప్రజలకు వివరించడంతోపాటు, నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటించాల్సిన పద్ధతులపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచిస్తున్నారు. ఇళ్లలో నీటి కుళాయిలు లీకేజీ కాకుండా చూసుకోవడం, అవసరానికి మించి నీటిని వినియోగించకుండా ఉండటం, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడం వంటి చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. మున్సిపాలిటీ పరిధిలో పైపులైన్ల లీకేజీలను అరికట్టడం, తాగునీటి సరఫరాలో వృథాను నియంత్రించడం, నీటి వనరులను పరిరక్షించడం వంటి చర్యలకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలి.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి...

ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు.

నిధులు దారి మళ్లకుండా పకడ్బందీ చర్యలు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వాల మాదిరిగా ఇతర అవసరాలకు మళ్లించే పరిస్థితి ఇకపై ఉండకూడదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేసినట్లు సమావేశంలో అధికారులు, సంబంధిత శాఖలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేటాయించిన నిధులను లక్షిత వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలనే స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సబ్‌ప్లాన్ కింద కేటాయించిన ప్రతి రూపాయి ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడేలా శాఖల వారీగా వ్యయం, లబ్ధిదారుల వివరాలు, భౌతిక పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. నిధుల వినియోగంలో జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న ప్రయోజనాలను సమగ్రంగా నమోదు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. భూమి యాజమాన్యం ఆధారంగా అమలవుతున్న పథకాల వల్ల సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో ఏర్పడుతున్న వ్యత్యాసాలను గుర్తించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి, పథకాల వారీగా లబ్ధిదారుల పేర్లు, గ్రామాలు, సామాజిక వర్గం, అందిన ప్రయోజనాల వివరాలతో డిజిటల్ రికార్డు రూపొందించాలని సూచించారు. ప్రతి శాఖ తన పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించిన ప్రయోజనాలను స్పష్టమైన గణాంకాలతో వెల్లడించాలని అన్నారు.

1,300 ఎకరాల ఖాళీ భూమిపై దృష్టి

జిల్లా కలెక్టర్ల నుంచి అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో సుమారు 1,300 ఎకరాల మేర ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఈ భూమిని అవసరాలకు అనుగుణంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని భట్టి విక్రమార్క సూచించారు. ఇప్పటికే గుర్తించిన స్థలాలను అర్హులైన కుటుంబాలకు అందించేందుకు అవసరమైన అనుమతులు, తదుపరి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గృహ స్థలాలు లేని అర్హులైన కుటుంబాలకు స్థలాలు సమకూర్చేందుకు అవసరమైన చోట భూసేకరణ ప్రతిపాదనలను పరిశీలించాలని తెలిపారు.

ఆవాసాల్లో మౌలిక సదుపాయాలు

ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. విద్యుత్ సదుపాయాలు లేని ఆవాసాలను గుర్తించి విద్యుత్ లైన్లు, వైరింగ్, స్తంభాల ఏర్పాటు తదితర పనులను చేపట్టేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక అవసరాలను గుర్తించి కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని భట్టి విక్రమార్క సూచించారు. స్థానిక అవసరాల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, వివిధ శాఖల సమన్వయంతో పనులను చేపట్టాలని ఆదేశించారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తరించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు మొబైల్ వైద్య యూనిట్ల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్య సేవలు అందే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, విద్యుత్, గృహ వసతి, వైద్యం, సామాజిక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా లక్షిత వర్గాల జీవన ప్రమాణాలను పెంచేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఇరువురు నేతలు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు నవీన్ మిట్టల్, సందీప్‌కుమార్ సుల్తానియా, సురేంద్రమోహన్, సిక్తా పట్నాయక్, క్రిస్టినా, విజయేంద్రబోయి, గోపి, గుగులోతు రవి నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత

ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి...

సంబంధించిన వివిధ అంశాలను కేంద్ర మంత్రితో చర్చించారు. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, దేశవ్యాప్తంగా క్రీడాకారులు, క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా సూచించారు. ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నిర్ణీత సమయంలో అవసరమైన ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

క్రీడల నిర్వహణకు పకడ్బందీ ప్రణాళిక

ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ అనేది కేవలం క్రీడా పోటీలకే పరిమితం కాకుండా, రాష్ట్ర క్రీడా సామర్థ్యాన్ని దేశానికి పరిచయం చేసే గొప్ప అవకాశమని ఈ సందర్భంగా చర్చించారు. క్రీడా వేదికల సిద్ధత, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారులకు వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలు, సాంకేతిక ఏర్పాట్లు, పోటీల నిర్వహణకు అవసరమైన సిబ్బంది సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పోటీల నిర్వహణలో పారదర్శకత, సమయపాలన, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఖేలో ఇండియా ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రిని ఆహ్వానించాలి–వాకిటి శ్రీహరి

ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను ప్రత్యేకంగా కోరుతూ, తెలంగాణలో జరగనున్న ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ప్రారంభోత్సవానికి హాజరైతే ఖేలో ఇండియా గేమ్స్‌కు మరింత జాతీయ ప్రాధాన్యత లభిస్తుందని, దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు స్ఫూర్తి కలుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. క్రీడలను ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అనుగుణంగా తెలంగాణలోనూ క్రీడా సంస్కృతిని మరింత విస్తరించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక సదుపాయాలను దేశానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రజెంటేషన్

ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రూపొందించిన సమగ్ర ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర మంత్రికి వివరించారు. క్రీడల నిర్వహణకు సంబంధించి రూపొందించిన కార్యాచరణ, క్రీడా వేదికల సన్నద్ధత, అవసరమైన మౌలిక సదుపాయాలు, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, క్రీడాకారులకు కల్పించాల్సిన సదుపాయాలు తదితర అంశాలను ప్రజెంటేషన్‌లో వివరించారు.

ఈ సందర్భంగా కేంద్ర క్రీడల శాఖ సూచనలకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లను మరింత పటిష్టం చేసుకోవడం, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగడం, ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించడం ద్వారా క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటోందని, క్రీడల నిర్వహణలో ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ క్రీడాకారులకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు కృషి చేస్తోందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు.

తెలంగాణ యువతలో క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం

ఖేలో ఇండియా వంటి జాతీయ స్థాయి క్రీడా పోటీలు రాష్ట్రంలోని యువతకు తమ ప్రతిభను చాటుకునేందుకు గొప్ప వేదికగా నిలుస్తాయి.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి తగిన శిక్షణ, ప్రోత్సాహం, అవసరమైన సదుపాయాలు అందించేందుకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు దోహదపడతాయి.

తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం, యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడం వంటి లక్ష్యాల సాధనకు ఖేలో ఇండియా గేమ్స్ ఒక కీలక అవకాశంగా నిలవనున్నాయి.

రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అవకాశాలు, ప్రతిభావంతులైన యువతకు తగిన ప్రోత్సాహం కల్పించడం ద్వారా తెలంగాణను క్రీడా రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ప్రత్యేక సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్ర క్రీడల శాఖతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సమష్టి కృషితో ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణను రాష్ట్ర ప్రతిష్టకు ప్రతీకగా నిలిపి, యువ క్రీడాకారులకు గొప్ప అవకాశాలను కల్పించడంతో పాటు, దేశ క్రీడా రంగంలో తెలంగాణ పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

పల్లెల్లో గుప్పుమంటున్న గుడుంబా

మొదటి పేజీ తరువాయి...

కూలీ నాలీ చేసుకునే వారు మరులుతున్నారు. దీంతో పల్లెలతో పాటు పట్టణాల్లోనూ సారాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మండలం లో వివిధ ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా తయా రవుతోంది. గుట్టుచప్పుడు కాకుండా ప్లాస్టిక్ కవర్లలో నింపి రవాణా చేస్తునానరు. ఇబ్రహీంపట్నం మండలంలో గ్రామాల్లో, గోదూరు, తిమ్మాపూర్ తాండ, యామాపూర్, వేముల కుర్తి, ఎర్రాపూర్ తాండతో పాటు పలు ప్రాంతాల్లో గుడుంబా తయారీ జరుగు తున్నట్లు తెలుస్తోంది. ద్విచక్ర వాహనాలపై ఇతర గ్రామాలు, పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు సారా తయారీనే వృత్తిగా మలుచుకొని పెద్దఎత్తున తయారు చేసి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో గుడుంబా తయారీ పెద్దఎత్తున సాగేది. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ తయారీకి అడ్డుకట్ట వేయడానికి బెల్లం సరఫరాను నిషేధించింది. నాటు సార అక్రమ రవాణా కు అలవాటు పడిన కుటుంబాలకు వివిధ ఉపాధి అవకావాలు కల్పించారు. అనంతరం వారు సారా తయారీ మానుకునేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఇటీవల కాలంలో మండలంలో తిరిగి సారాయి గుప్పుమంటోంది. కొందరు తమ కోసం ఇప్పపువ్వుతో మేలి రకం సారా తయారు చేసుకుని తాగుతుండగా, మరి కొందరు ఇప్పపువ్వుతో పాటు బెల్లం, కుళ్ళిన పండ్లు, ఇతర మత్తు పదార్థాలతో గుడుంబా తయారు చేసి దందా సాగిస్తున్నారు. మందు బాబులు నాటు సారావైపు మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన కొందరు మత్తు కోసం నాటు సారాకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో నాటు సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం తాగాలంటే వందల రూపాయలు వెచించాల్సి వస్తోంది. చీప్ లిక్కర్ క్వాటర్ మద్యం కొనాలన్నా రూ. 100కు పైగానే ఖర్చువుతుంది. దీంతోనే తక్కువ ధరలో దొరుకు తున్న నాటు సారాయి (గుడుంబా) తాగేందుకు మందు బాబులు మొగ్గు చూపుతున్నారు. పేదలు, కూలీలు నివసించే పలు గ్రామాల్లో గుడుంబా, సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు, మండలాల్లోని తిమ్మాపూర్ తాండా, ఎర్రపూర్ తాండా, వేములకుర్తి, భర్తీపూర్, మూలరాంపూర్, యామాపూర్ పలు గ్రామాల్లో గుడుంబా అమ్మకాలు గుట్టుచప్పుడు కాకుండా కొనసాగు తున్నాయి. రోజువారి కూలీ పనులుల చేసుకుని బతికేవారు చాలా మంది నాటు సారాను తాగు తున్నట్లు సమాచారం. నిషేధిత గుడుంబాపై నిఘా కరువు నిషేదిత గుడుంబాపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టలేకపోతుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా నాటుసారా తయారు చేసే మూలాలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టిసారించకపోవడంతో విచ్చలవిడిగా నాటుసారా తయారవుతుందనే వాదన వినిపిస్తోంది. సారా అమ్మకాలు ఆగాలంటే తయారీ మూలాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గుట్టుగా తయారీ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తూ కొందరూ. తక్కువ సమయం లో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో గుడుంబాను పెద్ద ఎత్తున తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు నామమాత్రపు దాడులు నిర్వహించి సారా అమ్మకాలపై కంటి తడుపు దాడులు నిర్వహిస్తున్నారు. మూలాలను వెతకకుండా ఎక్కడో ఒక చోట దాడులు నిర్వహిస్తూ, దాడులు నిర్వహించే సమయంలో అదే శాఖలో ఉన్న కొందరు సమాచారం అందించి సారా తయారీదారులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపి స్తున్నాయి. కిందిస్థాయి సిబ్బందిని పక్కనపెట్టి ఉన్నత అధికారులు నాటు సారాపై దృష్టి సారించి దాడులు నిర్వహిస్తే మండలంలో నాటు సారా రూపుమాపవచ్చు అనే వాదనలు సైతం బలంగా వినిపిస్తున్నాయి.

బెల్లంపల్లిలో వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



బెల్లంపల్లి, అక్టోబర్ 29, (ప్రజాకలం) ప్రతినిధి.. బెల్లంపల్లి పట్టణంలో వన్ టౌన్ పోలీస్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది. సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. సంఘ విద్రోహ శక్తుల నుంచి ప్రజలను కాపాడే క్రమంలో ఎంతోమంది పోలీసులు వారి జీవితాలను త్యాగం చేశారన్నారు.వారు చేసిన సేవలను స్మరిస్తూ కొవ్వతుల ర్యాలీ నిర్వహించమన్నారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ,పోలీస్ సిబ్బంది,ప్రజలు తదితరులు పాల్గొన్నారు....

మెట్పల్లిలో యువకుడిపై కత్తితో దాడి

పాత గొడవే కారణమని బాధితుడి ఫిర్యాదు.. కేసు నమోదు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 29 (ప్రజా కలం) పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో బుధవారం రాత్రి యువకుడిపై కత్తితో దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. బీహార్ రాష్ట్రానికి చెందిన హిట్లర్ కుమార్ (20) అనే యువకుడిపై పాత గొడవను మనసులో పెట్టుకుని కొందరు కత్తితో దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం కూలీ పని కోసం మూడు నెలల క్రితం మెట్పల్లికి వచ్చిన హిట్లర్ కుమార్‌కు, దసరా సందర్భంగా ఈ నెల 20న బీహార్‌కు చెందిన కొందరితో పని విషయమై మాటామాటా పెరిగి గొడవ జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 28న రాత్రి 8 గంటల సమయంలో ఆర్టీసీ బస్ డిపో వద్ద హిట్లర్ కుమార్‌పై కత్తితో దాడి చేయగా, అతడి ఎడమ చేతికి తీవ్ర గాయమైందన్నారు. బాధితుడి అరుపులతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారన్నారు. భాదితుని ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో స్వీపర్ పోస్టును

మంజూరు చేయాలి

- ప్రభుత్వ విప్‌కు విజయ రమణారావుకు వినతి

పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌కు రెగ్యులర్ స్వీపర్ పోస్టును మంజూరు చేయాలని కోరుతూ పాఠశాల సిబ్బంది ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దాపూర్ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు దాదాపు 330 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు.పాఠశాలలో 36కు పైగా తరగతి గదులతో పాటు ఇతర అనుబంధ గదులు ఉన్నాయని వివరించారు.పాఠశాల ప్రారంభమైన నాటి నుంచి గత 13 ఏళ్లుగా అటెండర్,సెక్యూరిటీ గార్డులే అదనంగా స్వీపర్ బాధ్యతలను కూడా నిర్వర్తిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.పాఠశాలలో పరిశుభ్రత అత్యంత ఆవశ్యకమైనందున, తరగతి గదులను నిత్యం శుభ్రపరిచేందుకు వెంటనే పూర్తిస్థాయి స్వీపర్ పోస్టును మంజూరు చేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అటెండర్ సంకెండ్ల లక్ష్మీరాజం,సెక్యూరిటీ గార్డ్ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమానికి బీజేపీ నిరంతరం కృషి

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడికి కట్కూరి సత్యనారాయణ రెడ్డికి ఘన సన్మానం



పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కట్కూరి సత్యనారాయణ రెడ్డిని మినీ ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు,పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో స్థానిక నాయకులు ఆయనకు శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ రైతు సమస్యలపై నిరంతరం పోరాడే ఉద్యమ నేపథ్యం ఉన్న సత్యనారాయణ రెడ్డికి జిల్లా అధ్యక్ష బాధ్యతలు దక్కడం హర్షణీయమని పేర్కొన్నారు.ఆయన నాయకత్వంలో కిసాన్ మోర్చా జిల్లావ్యాప్తంగా మరింత బలోపేతం కావడంతో పాటు,అన్నదాతల సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగుతాయని ధీమా వ్యక్తం చేశారు.ఈ సన్మానానికి సత్యనారాయణ రెడ్డి స్పందిస్తూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని,రైతుల హక్కులు,సమస్యల పరిష్కారం కోసం బీజేపీ కిసాన్ మోర్చా ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజేశం, ప్రముఖ నాయకులు అవ్వ సురేష్, రవీందర్,శ్రీనాథ్,వైభవ్ శ్రీను,గుంపుల శ్రీను, గణేష్,డిష్ సంతోష్,సాడే మధు,రవీందర్ రావు,అలువక లక్ష్మణ్,భాస్కర్,ఆర్టీవో శ్రీను తదితర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు,స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో నిజాయితీ.. పారదర్శకత ప్రతి ఉద్యోగి బాధ్యత

- జగిత్యాల కలెక్టరేట్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమం



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 29(ప్రజా కలం) విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అవగాహన సమావేశం, సమగ్రత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రసూనాంబ, అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాసేవలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం, ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ అవసరాల కోసం వచ్చే ప్రజలకు నిబంధనల మేరకు సకాలంలో సేవలందించాలని, విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి అధికారి, ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు.అవినీతి నివారణ కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, అధికారులు, ఉద్యోగులు, ప్రజల సమష్టి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని వివరించారు. కార్యాలయాల్లో పారదర్శక విధానాలను పాటించడం, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా అందించడం, దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించడం ద్వారా మెరుగైన పాలన అందించవచ్చని తెలిపారు.అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ మహేందర్ రెడ్డి, సీఐ (ప్రేమ్ అవినీతి నివారణ, ఉద్యోగుల నైతిక బాధ్యతలు, విధుల నిర్వహణలో పాటించాల్సిన విలువలపై అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా చట్టానికి లోబడి విధులు నిర్వర్తించాలని సూచించారు.అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. నిజాయితీతో విధులు నిర్వహిస్తూ, అవినీతిని నిరోధించేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రతినబూనారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠిక శిలాఫలకం మాయం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు



పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

నూతనంగా నిర్మిస్తున్న పెద్దపల్లి బస్ డిపో ప్రాంగణంలో దశాబ్దాల చరిత్ర కలిగిన భారత రాజ్యాంగ పీఠిక రాతి శిలాఫలకం అదృశ్యం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంస్థ రాష్ట్ర కార్యదర్శి బాలసాని వెంకటేశం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

50 ఏళ్ల నాటి చారిత్రక సంపద

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా 15 ఆగస్టు 1972 – 14 ఆగస్టు 1973, అప్పటి కేంద్ర ప్రభుత్వం పెద్దపల్లి పంచాయతీ సమితి ఆవరణలో,ప్రస్తుత బస్ డిపో ప్రాంగణం ఈ శిలాఫలకాన్ని ప్రతిష్ఠించింది. హిందీ,తెలుగు భాషల్లో రాజ్యాంగ పీఠికతో కూడిన ఈ రాతి ఫలకం అమరవీరుల త్యాగాలకు,రాజ్యాంగ ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచింది.

ప్రజాసంఘాలు ..దేశభక్తుల ఆవేదన

విలువైన ప్రభుత్వ ఆస్తి,స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వానికి చిహ్నమైన ఈ చారిత్రక శిలాఫలకాన్ని ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు అక్కడి నుంచి తొలగించి మాయం చేశారని వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు.ఇది దేశభక్తులను, స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని,సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి దుశ్చర్యను తీవ్రంగా వరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు.పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

న్యాయవాదులపై ఖాకీల జులుం

- కోర్టుల బహిష్కరణతో పెద్దపల్లి బార్ అసోసియేషన్ నిరసన



పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

న్యాయస్థాన ప్రాంగణంలో తమ వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న న్యాయవాదుల పట్ల పోలీసులు తీవ్ర దురుసుతనంతో వ్యవహరించడాన్ని నిరసిస్తూ పెద్దపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా విధుల బహిష్కరణ చేపట్టారు.సుల్తానాబాద్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టేందుకు తీసుకొచ్చిన తమ నిందితుల వద్ద నుంచి అవసరమైన సంతకాలు తీసుకునేందుకు పెద్దపల్లి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎం.శరత్ కుమార్, తాని నరేష్ ప్రయత్నించగా,జూలపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శాంతయ్యతో పాటు మరికొందరు కానిస్టేబుళ్లు వారిని అన్యాయంగా అడ్డుకుని తీవ్ర అసభ్యకరంగా ప్రవర్తించారని వారు ఆరోపించారు.చట్టబద్ధమైన ప్రక్రియను అడ్డుకోవడమే కాకుండా,పోలీసుల వైఖరిని ప్రశ్నించిన న్యాయవాదులను ఉద్దేశించి అడ్వకేట్ అయితే ఏంటయ్యా బాబూ... అంటూ హేళన చేస్తూ,నా యూనిఫాం పవర్ ఏంటో చూపిస్తా అంటూ దౌర్జన్యపూరిత బెదిరింపులకు దిగడంపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆవరణలోనే చట్టాన్ని కాలరాస్తూ న్యాయవాదుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సదరు బాధ్యులైన కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు తక్షణమే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మల్లేశం,ప్రధాన కార్యదర్శి రాచూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు కోర్టు కార్యకలాపాలను స్తంభింపజేసి నిరసన చేపట్టారు.అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు న్యాయవాదులతో కలిసి పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.



అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి



పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు అనంతరం డీసీపీ మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం ఎంతో మిన్న అని,ఆపదలో ఉన్నవారికి రక్తం ఇచ్చి ప్రాణాలు నిలపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అమరులైన పోలీసు అధికారుల స్మరణార్థం చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సర్కిల్ పరిధి నుండి సుమారు 350 మంది రక్తదాతలను ఎంపిక చేసి రక్తసేకరణ చేపట్టినట్లు తెలిపారు.కేవలం ప్రజలే కాకుండా,పోలీస్ శాఖ నుంచి కూడా దాదాపు 50 మంది పోలీసు అధికారులు,సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు.సమాజ సేవలో భాగస్వాములవుతూ ప్రాణదాతలుగా నిలిచిన రక్తదాతలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసి విజయవంతం చేసిన పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్‌తో పాటు వారి పోలీస్ బృందానికి డీసీపీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్,ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్ గౌడ్,మహిళా పోలీస్ స్టేషన్ సిఐ రమేష్ బాబు,ఎస్ఐలు మధుకర్,రాజేష్,శ్వేత పోలీస్ సిబ్బంది,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎరబాటి వెంకటేశ్వర్ రావు,వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు,కోశాధికారి పాంపాటి శ్రీకాంత్,స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్,జిల్లా కమిటీ సభ్యులు డీవీఎస్ మూర్తి,గూళ్ళ అంజన్ కుమార్,వేల్పుల రమేష్,వేల్పూరి సంపత్ రావు తోపాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

రేపు ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశం



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 29 (ప్రజా కలం) మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సి ఉండగా, అవసరమైన కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. నిబంధనల ప్రకారం వాయిదా పడిన సమావేశాన్ని శుక్రవారం (అక్టోబర్ 30) ఉదయం 11 గంటలకు మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి

5 లక్షల చెక్కు అందజేత



ఎండపల్లి, అక్టోబర్ 29 : (ప్రజా కలం ప్రతినిధి)

మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన లింగాల చిన్నయ్య గత సంవత్సరం 02.09.2025 రోజున పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడం జరిగింది. ఈ విషాద ఘటన తో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఈ నేపథ్యం లో విద్యుత్ శాఖ తరపున బసంత్ నగర్ విద్యుత్ శాఖ ఏఈ మానాల ప్రసాద్, మారేడుపల్లి గ్రామ సర్పంచ్ బాల్సాని శారద-మల్లేష్ గౌడ్ ఆధ్వర్యం లో గురువారం రోజున మృతుని భార్య లింగాల సుశీల కు రూ.5,00,000 (ఐదు లక్షల రూపాయలు) పరిహారం చెక్కును అంద జేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ బాల్సాని శారద-మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రభుత్వం, విద్యుత్ శాఖ అందించిన పరిహారం కొంతవరకు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో విద్యుత్ శాఖ ఏఈ మానాల ప్రసాద్, లైన్ ఇన్స్పెక్టర్ నర్సింగం, లైన్ మెన్ శ్రీనివాస్, జే ఎల్ ఎం నాగరాజు మారేడుపల్లి గ్రామ సర్పంచ్ బాలసాని శారద--మల్లేశం గౌడ్, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఖేత్ బచావో అభియాన్ అవగాహన సదస్సు

- మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో



ఎండపల్లి, అక్టోబర్ 29 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని శానబండ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ లో గురువారం రోజున రైతుల కు సేంద్రియ వ్యవసాయం, ఎల్ నినో ప్రభావం తో పంటలకు కలిగే నష్టాలు, పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించేందుకు గ్రామం లో ఖేత్ బచావో అభియాన్ సదస్సు కార్య క్రమాన్ని గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారి బలిజపల్లి సందీప్, గ్రామ సర్పంచ్ గాధం భాస్కర్, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, భూసార పరిరక్షణ, మట్టి పరీక్షల అవశ్యకతను, రసాయన ఎరువుల, పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని రైతులకు వివరించారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్ష పాతం లో అసమానతలు, వర్షాభావ పరిస్థితులు, పంటల ఎదుగుదల పై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశాల గురించి అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయం లో నష్టభయాన్ని తగ్గించి రైతుల ఆదాయాన్ని మెరుగు పరచడానికి పంటల వైవిధ్యీకరణ ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. రైతులు వ్యవ సాయ శాఖ సూచనలు పాటిస్తూ వాతావరణ మార్పులకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

-గాయత్రి కళాశాల విద్యార్థుల రక్తదానం

పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ,వారికి ఘన నివాళిగా పెద్దపల్లిలో భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో స్థానిక గాయత్రి జూనియర్,డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ప్రాణదానం కంటే గొప్ప దానం మరొకటి లేదు అనే ఉన్నతమైన సందేశాన్ని చాటుతూ విద్యార్థులు తమ సామాజిక బాధ్యతను,మానవత్వాన్ని ఘనంగా చాటుకున్నారు.రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ఆపన్నుల ప్రాణాలను కాపాడవచ్చని వారు నిరూపించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ సేవలో యువత ముందంజలో ఉండాలని,అమరులైన పోలీసుల త్యాగాలు ఎందరికో ఆదర్శమని కొనియాడారు.విద్యార్థులను రక్తదానానికి ప్రోత్సహించినందుకు ఎన్ఎస్ఎస్ విభాగాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లంకి శ్రీనివాస్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సమ్మద్,అధ్యాపక బృందం,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజా కలం
శుక్రవారం, అక్టోబర్ 30, 2026

వానలు ముఖం చాటేస్తే..

రైతన్నకు దిక్కెవరు?

ఆకాశం కరుణించకపోతే రైతు బతుకు ఎండిపోతుంది. చినుకు నేలరాలకపోతే ఆశలతో నాటిన విత్తనాలు మొలకెత్తకుండానే మట్టిలో కలిసిపోతాయి. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి కళ్లముందే ఆవిరవుతుంటే అన్నదాత గుండెల్లో ఆందోళన మొదలవుతుంది. ప్రకృతి దెబ్బకు తోడు అప్పుల భారం రైతు జీవితాన్ని మరింత కుంగదీస్తుంది. దేశానికి అన్నం పెట్టే రైతన్న బతుకే వాన చినుకులపై ఆధారపడటం వ్యవసాయ రంగంలోని అభద్రతకు నిదర్శనం. తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు మరోసారి రైతు భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను ఆపడం మన చేతుల్లో లేకపోవచ్చు.. కానీ వాటి ప్రభావం నుంచి రైతును కాపాడే భరోసా కల్పించడం పాలక వ్యవస్థ బాధ్యత. తెలంగాణలో 2026 వానాకాలంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 615.5 మిల్లీమీటర్లకే పరిమితమైంది. అంటే 17 శాతం లోటు నమోదైంది. రాష్ట్రంలోని 621 మండలాల్లో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించగా, వాటిలో 111 మండలాలు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు తగ్గడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వర్షాభావం ప్రభావం పంటలకే పరిమితం కాదు. పశువులకు మేత కొరత, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి తగ్గుదలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది. పెట్టుబడుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతుంటే, ఆదాయం మాత్రం తగ్గిపోతుంది. ఫలితంగా రైతు కుటుంబాల ఆర్థిక భద్రత ప్రశ్నార్థకమవుతుంది. కరువు ప్రకటించడంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదు. పంట నష్టాలను క్షేత్రస్థాయిలో అంచనా వేసి అర్హులైన రైతులకు పరిహారం సకాలంలో అందించాలి. వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు తీసుకోవాలి. తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి. గ్రామీణ ఉపాధి అవకాశాలను విస్తరించాలి. అదే సమయంలో వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలాల పెంపు, తక్కువ నీటితో పండే పంటల సాగును ప్రోత్సహించాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో రైతులకు శాస్త్రీయ మార్గదర్శకత్వం అందించాలి. వానలు కురవడం మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ వానలు విఫలమైనప్పుడు రైతును ఆదుకోవడం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది. కరువు వేళ రైతన్నకు కావాల్సింది కేవలం ఓదార్పు కాదు.. సకాలంలో సాయం, నష్టానికి పరిహారం, భవిష్యత్తుపై భరోసా!

- సి.హెచ్. ప్రతాప్



మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ పై

కౌన్సిలర్ల అసహనం

- సమాచారం ఇవ్వడం లేదంటూ సభ నుంచి వాకౌట్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 29(ప్రజా కలం) మున్సిపల్ చైర్పర్సన్ మైలారపు లింబాద్రి వ్యవహారశైలిని నిరసిస్తూ మెట్ పల్లి మున్సిపల్ సాధారణ సమావేశం నుంచి అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి తమకు సరైన సమాచారం అందించడం లేదని, చైర్పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. తమ వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర కీలక అంశాలపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులుగా వార్డుల అభివృద్ధిలో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి పనికి సంబంధించిన వివరాలను అందించాలని డిమాండ్ చేశారు.

అన్ని పార్టీల కౌన్సిలర్లు ఏకకాలంలో వాకౌట్ చేయడం వట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ఇంటి దొంగతనాల ముఠా అరెస్ట్

ముగ్గురు నిందితుల పట్టివేత .. బంగారం,వెండి స్వాధీనం - జూలపల్లి ఎస్ఐ బుద్దే మల్లేష్



పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా జూలపల్లి జూలపల్లి మండలంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి,వారి వద్ద నుంచి సుమారు 12.9 గ్రాముల బంగారం,58 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జూలపల్లి ఎస్ఐ బుద్దే మల్లేష్ తెలిపారు.జూలపల్లి మండలం పెద్దాపూర్ బస్ స్టాప్ వద్ద గురువారం చోరీ సొత్తును విక్రయించేందుకు తరలిస్తుండగా నిఘా ఉంచి కుమ్మరికుంటకు చెందిన ఎక్కిరాల రాకేశ్ (20),పెద్దాపూర్ గ్రామానికి చెందిన కళ్ళెపెల్లి జాన్ (21),కళ్ళెపెల్లి సాయి చరణ్ (19)లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.నిందితులను విచారించగా, తాళాలు వేసి ఉన్న ఇళ్లనే ఎంచుకునితాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి విలువైన ఆభరణాలను దొంగిలించేవారని, ఆ సొత్తును మహారాష్ట్రకు తరలించి కరిగించడం లేదా గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించేవారని వెల్లడైందని ఎస్ఐ వివరించారు.గత జూన్ 15న కుమ్మరికుంట గ్రామానికి చెందిన వడ్డూరి సాగర్ ఇంట్లో,సెప్టెంబర్ 21న పెద్దాపూర్‌కు చెందిన కొత్తపల్లి పద్మ ఇంట్లో,అక్టోబర్ 14న అదే గ్రామానికి చెందిన కళ్ళెపెల్లి అంజయ్య ఇంట్లో జరిగిన వరుస దొంగతనాలకు ఈ ముగ్గురే బాధ్యులని నిర్ధారణ అయినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్ఐ బుద్దే మల్లేష్ మాట్లాడుతూ ప్రజలు ఇళ్లను విడిచి వెళ్లే సమయంలో నాణ్యమైన తాళాలు వేయడంతో పాటు పటిష్ట భద్రతా చర్యలు పాటించాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాల నివారణకు విస్తృత అవగాహన కల్పించాలి

స్కానింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ..

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : జిల్లా వైద్యాధికారి సుజాత



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 29(ప్రజా కలం)

బాల్య వివాహాల నివారణకు, బాలికల సంరక్షణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత సూచించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం–1994 నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.గురువారం జగిత్యాలలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, హైస్కూల్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు లింగ వివక్ష నిర్మూలన, బాలికల ప్రాధాన్యత, బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ, ప్రతి నెల పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. కేంద్రాల్లో ఫారం–ఎఫ్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేసే అంశంపై సమావేశంలో చర్చించారు. గైనకాలజిస్టులు ఎంటీపీ చట్టానికి సంబంధించిన నిబంధనలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు.మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలు ప్రతి నెల ఫారం–ఎఫ్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడంతోపాటు, సంబంధిత వివరాలను నెలవారీగా 5వ తేదీలోపు కేటాయించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమర్పించాలని తెలిపారు. జగిత్యాల జిల్లాలో ప్రస్తుతం 89 స్కానింగ్ కేంద్రాలు అనుమతులు పొంది ఉన్నాయని వెల్లడించారు.ఈ సమావేశంలో గైనకాలజిస్టులు డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ విశ్వభారతి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, రేడియాలజిస్ట్ ఎన్. స్నేహ, డీపీఆర్ఓ శ్రీధర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తౌటు రామచంద్రం, అనుగంటి రాజేశం, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్ రాథోర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులతో ఎమ్మెల్యే ముఖాముఖి

- విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై ఆరా



మల్లాపూర్, అక్టోబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి):

మల్లాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఉపాధ్యాయుడి పాత్రలో విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి, వారి సమాధానాల ద్వారా అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థినుల విద్యాభ్యాసం, బోధన తీరు, పాఠశాలలోని పరిస్థితులపై ఆరా తీశారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ప్రిన్సిపల్ శ్రీలత, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ముద్దం శరత్ గౌడ్, బండి లింగస్వామి గౌడ్, కదుర్క నర్సయ్య, మ్యకల సతీష్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల పై రైతులు దృష్టి సారించాలి

వ్యవసాయ అధికారి సాయి కిరణ్



వెల్గటూర్, సెప్టెంబర్ 29, ప్రజాకలం కలం, ప్రతి నిధి : ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రోబోయే యాసంగిలో వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల పై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి సాయికిరణ్ రైతులకి తెలిపారు. గురువారం మండలంలోని జగదేవ్ పేట గ్రామంలో "సాగుభూమి సంరక్షణ (కేతి బచావో)కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ భూసారా పరీక్షల ఆధారంగా పంటలకు అవసరమైన ఎరువులను వాడాలని పేర్కొన్నారు. పంట కోసిన తరువాత కొయ్యలని కాల్చకుండా వచ్చే సీసన్ జంతువుల మేతగా ఉంచాలని తెలిపారు. అనంతరం మిగిలిన కొయ్యలను భూమిలోనే కలియ దున్నాలని తెలిపారు. ఈ సందర్భంగా జగదేవ్ పేట గ్రామం లో ఆయిల్ పామ్ పంటలని అక్కడి రైతులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో జగదేవ్ పేట సర్పంచ్ తిరుపతి, ఉపసర్పంచ్ గంగయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి రవళి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

గుండంపల్లి మీదుగా ఖానాపూర్‌కు బస్సు

- ఆర్ఎం సానుకూల స్పందన

మల్లాపూర్ (ప్రజాకలం ప్రతినిధి): గుండంపల్లి గ్రామం మీదుగా ఖానాపూర్ వరకు ఆర్టీసీ బస్సు నడిపేందుకు ఆర్టీసీ ఆర్ఎం రాజు సానుకూలంగా స్పందించినట్లు గుండంపల్లి సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య తెలిపారు. జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు ఆదేశాల మేరకు, మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖతో కరీంనగర్‌లో ఆర్ఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.కోరుట్ల నుంచి గుండంపల్లికి ఉదయం 11 గంటలకు, రాత్రి 8 గంటలకు అదనపు బస్సులు నడపాలని, మెట్‌పల్లి నుంచి రాయికల్ వెళ్లే బస్సులను గుండంపల్లి మీదుగా నడిపించాలని కోరినట్లు తెలిపారు. బస్సు సౌకర్యం మెరుగుపడితే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులతో పాటు గ్రామ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య పేర్కొన్నారు.



పాత్రికేయుల సేవలు అభినందనీయం

- ఐజేయూ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే సంజయ్ సన్మానం

మల్లాపూర్, అక్టోబర్ 28 (ప్రజాకలం ప్రతినిధి): ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన కార్యవర్గాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సభావత్ మల్లేష్, ఉపాధ్యక్షుడు బద్ధం రామ్ చందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బద్ధం శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి సింగిరెడ్డి అశోక్ రెడ్డి,వాసం మధుకర్,గుగ్గిళ్ల శేఖర్,మల్లేష్ లను శాలువాలతో సత్కరించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాత్రికేయులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్దం శరత్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల నోట్లో మట్టికొడుతున్న కాంగ్రెస్ సర్కార్

రెండో రోజుకు చేరుకున్న మహా సైకిల్ యాత్ర - కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడాలని బీఆర్ఎస్ డిమాండ్



పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మేడిగడ్డ వద్ద 20 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా పంపులు ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొడుతోంది. కేసీఆర్‌పై కక్షతో ప్రాజెక్టుపై విషం చిమ్ముతూ,పంటలు వేసుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం రైతాంగాన్ని వెనాకం చేయడమే అని బీఆర్ఎస్ పెద్దపల్లి,గోదావరిఖని పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్,బొడ్డు రవీందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టతను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ,వెంటనే పంపులు ఆన్ చేసి రైతులకు సాగు,తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు చేపట్టిన 400 కిలోమీటర్ల మహా సైకిల్ యాత్ర రెండో రోజు గురువారం విజయవంతంగా కొనసాగింది. ఉప్పు రాజ్ కుమార్,బొడ్డు రవీందర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం అన్నారం బ్యారేజ్ వద్ద పునఃప్రారంభమైన ఈ యాత్ర, మార్గమధ్యంలోని గ్రామాలను కలుపుకుంటూ సుందిళ్ల పార్వతి బ్యారేజ్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ని విఫలం చేయాలనే దురుద్దేశంతో కాళేశ్వరంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని,కన్నెపల్లి వద్ద వెంటనే యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసి నీటిని లిఫ్ట్ చేయాలని డిమాండ్ చేశారు.మేడిగడ్డ నుంచి సుందిళ్ల వరకు సుమారు 40 కిలోమీటర్ల మేర తాము పర్యటించిన ప్రతి గ్రామంలోనూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని,కాలువలకు నీరందక,భూగర్భ జలాలు పడిపోయి బోర్లు ఎండిపోతుంటే, మరోవైపు గంటల తరబడి విద్యుత్ కోతలు, లో-వోల్టేజీ సమస్యలతో మోటార్లు,ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ అధికారంలో ఉంటేనే తమ బతుకులు బాగుపడతాయని రైతులు చెబుతున్నారని,కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి విభాగాన్ని సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులపై డాక్యుమెంటరీ రూపొందించి కేసీఆర్ కి అందజేస్తామని స్పష్టం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకుండా కొండపోచమ్మ సాగర్ వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాశిపాక వాసు,ఆరేపల్లి సురేష్,ముత్యం లక్ష్మణ్ గౌడ్,నవీన్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణతోనే ఆయిల్‌పామ్ సాగుకు భరోసా

- జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్



పెద్దపల్లి,అక్టోబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం తగ్గి భూగర్భ జలాల లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ఆయిల్‌పామ్ రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పెద్దపల్లి జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్ సూచించారు.గురువారం గట్టుసింగారంలో రైతు దుగ్గెంపుది కమలాకర్ రెడ్డికి చెందిన ఆయి ల్‌పామ్ తోటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగాజిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే వాణిజ్య పంట అయినప్పటికీ నిరంతర నీటి లభ్యత, సమతుల్య పోషక యాజమాన్యం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు బిందు సేద్యం ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించడంతో పాటు,తోటల్లో ఎండిన ఆకులు, సేంద్రియ వ్యర్థాలతో మల్చింగ్ చేపట్టి నేలలో తేమను నిలుపుకోవాలని,నీటి లభ్యత ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో తడులు అందించాలని తెలిపారు.మొక్కల ఆరోగ్యం, పుష్పగుచ్ఛాల అభివృద్ధి కోసం సేంద్రియ ఎరువులు, సమతుల్య పోషకాలను అందించాలని,వర్షపు నీటి సంరక్షణకు వ్యవసాయ కుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కొత్తగా సాగు చేపట్టే రైతులు ముందుగా దీర్ఘకాలిక నీటి వనరులను నిర్ధారించుకోవాలని చెబుతూ,ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, డ్రిప్ పరికరాలు,యాంత్రీకరణ సదుపాయాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుమల ఆయిల్ కంపెనీ సీఈఓ కేశు కళ్యాణ్కర్, విస్తరణ అధికారి రాము, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, జైన్ డ్రిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం!

ఎటపాక జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, చోడవరం ఎంపీటీసీ అభ్యర్థి గుండి జెన్నీ



ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక,అక్టోబర్ 29 : పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలంలో గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎటపాక జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, చోడవరం ఎంపీటీసీ అభ్యర్థి గుండి జెన్నీ తెలిపారు.స్థానిక ఎన్నికలలో ప్రచారంలో భాగంగా పాండురంగాపురం, చోడవరం, ఎర్రగుంట గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఓటరు కాంగ్రెస్, సిపిఎం సీపీఐ పార్టీలు బలపరిచిన వై ఏస్ ఆర్ పార్టీ అభ్యర్థులు ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వారు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు తమకు మద్దతుగా నిలిచి, ఎన్నికల్లో విజయాన్ని అందించాలని అభ్యర్థులు కోరారు.

సీతారామ ప్రాజెక్టు కాలువ నీళ్లు భద్రాద్రి జిల్లాలోని ప్రతి ఎకరానికి అందించాలి

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్.. సమస్య పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఉద్యమం

ప్రజాకలం ప్రతినిధి,బూర్గంపహాడ్ , అక్టోబర్ 29:

సీతారామ ప్రాజెక్టు కాలువల ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలని బీజేపీ ఎమ్మెల్సీ చింతలపూడి అంజిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో భాగంగా ఆయన బుధవారం జిల్లా అధ్యక్షుడు బై రెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి మొరంపల్లి బంజరలోని సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కాలువలు బూర్గంపాడు, అశ్వాపురం, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట తదితర మండలాల మీదుగా వెళ్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో ప్రాజెక్టు నిర్మాణం కోసం గిరిజన రైతులు, సామాన్య రైతులు తమ భూములను కోల్పోయారని పేర్కొన్నారు. అయితే, ప్రాజెక్టు కాలువలు తమ ప్రాంతాల మీదుగా వెళ్తున్నప్పటికీ స్థానిక రైతులకు సాగునీరు అందడం లేదని, నీటిని ఇతర జిల్లాలకు తరలిస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన గిరిజన రైతులు, ఇతర రైతులకు న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతులందరికీ సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జిల్లాలో ఎల్నినో ప్రభావంతో వ్యవసాయంపై పడుతున్న ప్రభావాన్ని ప్రస్తావిస్తూ, సకాలంలో సాగునీరు అందుబాటులో ఉంటే రైతులకు ఎంతో ప్రయోజనం కలిగేదని అన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో జిల్లా రైతాంగాన్ని సమీకరించి భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. వెంకటరమణ, బూర్గంపాడు మండల అధ్యక్షుడు బి. సాయిశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ రెబల్ అభ్యర్థి పాయం దేవి!

- ఎటపాక జడ్పీటీసీ బరిలో ముమ్మర ప్రచారం



ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 29, గురువారం:

పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలోని ఎటపాక మండలంలో తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థి పాయం దేవి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎటపాక జడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆమె గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ప్రచారంలో భాగంగా ప్రజలతో మమేకమవుతూ వారి మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతానని ఆమె పేర్కొంటూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఎటపాక జడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పాయం దేవి విస్తృత ప్రచారం నిర్వహిస్తుండటంతో స్థానికంగా ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారుతోంది. రానున్న ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారన్న ఉత్కంఠ నెలకొంది.

ఆయిల్ పామ్ సాగులో ఎల్ నినో జాగ్రత్తలు

- ముధోల్‌లో అవగాహన సదస్సు



తానూర్, అక్టోబర్ 29(ప్రజా కలం): ముధోల్ రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై ఎల్ నినో ప్రభావం, రక్షణాత్మక చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు, భైంసా డివిజన్ ఉద్యాన అధికారి షేక్ జావిద్ పాషా మాట్లాడుతూ ఎల్ నినో సమయంలో తగినంత నీరు, సిఫార్సు చేసిన ఎరువులు అందించాలన్నారు, పొటాష్ వాడకం పెంచడం, మల్చింగ్ చేయడం ద్వారా నీటి ఎద్దడిని తట్టుకోవచ్చని తెలిపారు,30-35 ఆకులు ఉంచడం, మైక్రోజేడ్స్ వాడటం మంచిదని సూచించారు,నీటి కుంటల నిర్మాణానికి సబ్సిడీ ఉందన్నారు, కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అంతరిక్షప్రయోగాలపై

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



ఆత్మకూరు: (ప్రజాకలం ప్రతినిధి) భారత శాస్త్రవేత్తలు అంతరిక్ష ప్రయోగాల్లో చేస్తున్న కృషిని ఇస్రో హెడ్ శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. బుధవారం ఆత్మకూరు లోని ఏం వి రామన్ పాఠశాలలో నిర్వహించిన గ్లోబల్ సైన్స్ అండ్ స్పేస్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని, విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, కరస్పాండెంట్ హోన్సీ శ్రీధర్ గౌడ్, సీఐ శివకుమార్, పాఠశాల చైర్మన్ శ్రీధర్ గౌడ్, ఎంఈఓ, ఎస్సై పాల్గొన్నారు.

మొగిలి - తానూర్ బీటీ రోడ్డు పనులకు

ఎమ్మెల్యే రామారావు పటేల్ భూమిపూజ

-రూ.5.90 కోట్లతో నిర్మాణం..

తానూర్, అక్టోబర్ 29(ప్రజా కలం): మండలంలోని మొగిలి గ్రామం నుండి తానూర్ వరకు రూ.5.90 కోట్ల ఎంఆర్ఆర్ గ్రాంట్‌తో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గురువారం భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొగిలి, కోలూర్, తానూర్ గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి కల నేటితో సాకారమవుతోందని హర్షం వ్యక్తం చేశారు, నాణ్యమైన రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వస్తే విద్యార్థులు, రైతులు, సాధారణ ప్రయాణికుల రవాణా కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు, గత పాలకుల నిర్లక్ష్యం వల్లే మొగిలి గ్రామం అభివృద్ధిలో వెనుకబడిందని, తమ ప్రభుత్వంలో మౌలిక సదుపాయాల కల్పనకే మొదటి ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు, అంతేకాకుండా, మొగిలి నుంచి జౌలా-కె మీదుగా కళ్యాణి గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు,ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, మొగిలి, కోలూర్ సర్పంచులు ఉషా-దర్శన్, బి. మాధవరావు, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, బీజేపీ నాయకులు చక్రధర్ పటేల్, దేవిదాస్ పటేల్, నాగేందర్ పటేల్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీ రామ నవమి వరకు రామాలయం నిర్మాణం పూర్తి చేస్తాం

- కొంత మంది దుష్టశక్తులు అభివృద్ధి చేయడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారు

- రామాలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

నిర్మల్ అక్టోబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ముధోల్ నియోజకవర్గాన్ని ప్రణాళిక బద్దంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే కొంత మంది దుష్ట శక్తులు భైంసాను అభివృద్ధి చేయడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.గురువారం భైంసా పట్టణం లోని రామ్ లీలా మైదానం లో 50 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న శివ రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా అయన మాట్లాడారు. రామనవమి వేళ ఇచ్చిన మాట ప్రకారం శివ రామాలయ నిర్మాణానికి 40 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. వచ్చే శ్రీ రామ నవమి వరకు ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.. భవ్య మైనా రామ మందిరం నిర్మించు కోవడంఎంతో అనందంగా ఉందని ఆలయాల్లో దేవత మూర్తులకు తానే స్వంత డబ్బులు వేచిస్తానన్నారు..తన హయం లో సరస్వతి అమ్మ వారీ ఆశీస్సుల తో బాసర ఆలయ నిర్మాణానికి 350 కోట్ల రూపాయల నిధులు మంజూరై పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అదే విధంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని త్వరలో నే ప్రారంభిస్తున్నామన్నారు. భైంసా లో అయ్యప్ప ఆలయ ని కి వెళ్లాడని 50 లక్షల రూపాయల నిధులతో సి. సి. రోడు



వేయడం జరిగిందన్నారు. త్వరలో గట్టు మైసమ్మ ఆలయ రోడ్ కు నిధులు మంజూరు కావడం జరిగిందని, టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని త్వరలో నే పనులు ప్రారంభిస్తామన్నారు.. నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం తో పలు అభివృద్ధి పనులు చేస్తుంటే గిట్టని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు..అంతకు ముందు కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, ప్రముఖ పూజారి బాబు మహారాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బి. గంగాధర్, కౌన్సిలర్ చింతపండు రజిత మహేష్, మాట్లాడుతూ భైంసా లో రామాలయ నిర్మాణనికి నిధులు మంజూరు చేయించినందుకు వారు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు.. రామాలయం నిర్మించడం శుభప్రదం అన్నారు.కార్యక్రమం లో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

- స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని, స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ నిర్మల్ పట్టణ, గ్రామీణ మండలాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ సంస్థలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. సోఫీనగర్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల వసతిగృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన భద్రతతోపాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెమిస్టర్ పరీక్షల సమయానికి సిలబస్ పూర్తిచేయడంతోపాటు, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఎంఈసీ విభాగం విద్యార్థులతో మాట్లాడి విద్య, భోజనం, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించి, ప్రతిభ కనబరిచిన వారిని అభినందించి పెన్నులను బహుమతిగా అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యనగర్‌లోని స్పోర్ట్స్ అరీనాను పరిశీలించిన కలెక్టర్, క్రీడాకారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని, క్రీడలు ఆడేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. షటిల్ బ్యాడ్మింటన్, పికిల్‌బాల్ కోర్టుల పరిసరాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. మహేశ్వరం సమీపంలోని అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, జంతువుల స్టెరిలైజేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఖానాపూర్, భైంసా ప్రాంతాల్లోనూ అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డంప్ యార్డును పరిశీలించిన కలెక్టర్, తడి, పొడి చెత్త వేర్పాటు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.గండిరామన్న నుంచి కమలానగర్ వరకు చేపడుతున్న అటవీ, రెవెన్యూ భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అటవీ, రెవెన్యూ శాఖల భూముల హద్దులను స్పష్టంగా గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ భూముల సరిహద్దుల నిర్ధారణకు, భవిష్యత్తులో వివాదాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ఈ పర్యటనలో డివిఎహెచ్ఓ సురేష్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు రాజు, ప్రభాకర్, మున్సిపల్ డీఈ హరిభువన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రమణమ్మ కుటుంబసభ్యులను పలకరించిన పిడమర్తి రవి



తల్లాడ అక్టోబర్ 29 ప్రజా కలం న్యూస్ తల్లాడ పట్టణానికి చెందిన ప్రముఖ మట్టమ్మ హోటల్ అధినేత సరికొండ రమణమ్మ గారి కుటుంబ సభ్యులను గురువారం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు తెలుసుకొని కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం వారికి దసరా దీపావళి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరికొండ అప్పలరాజు, తెలుగుదేశం పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు సరికొండ శ్రీనివాసరాజు, వైరా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు, తదితరులు ఉన్నారు.

పలు కుటుంబాలకు నివాళులర్పించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు



తల్లాడ అక్టోబర్ 29 ప్రజా కలం న్యూస్ తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, నరసింహారావుపేట గ్రామాల్లో పలు కుటుంబాలను గురువారం తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కెవి) పరామర్శించారు. నరసింహారావు పేట గ్రామంలో సుంకర బిక్షమయ్య భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా అన్నారుగూడెం గ్రామంలో వట్టికొండ పున్నారావు దశదిన కర్మ, సూద సీతమ్మ దశదినకర్మలకు వారు హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో నాయకులు దుగ్గిదేవర వెంకట లాల్, పులి వెంకట నరసయ్య, తాళ్ల అగస్టీన్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకుబ్ పాషా ఉన్నారు.

కంఠమేశ్వర స్వామి ఆలయ వద్ద ప్రత్యేక హోమాలు

పూజలు చేసిన సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, గౌడ సంఘం పెద్దలు

తల్లాడ అక్టోబర్ 29 ప్రజా కలం న్యూస్ : శ్రీ సూరమాంబదేవి సమేత కంఠమేశ్వర స్వామి వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతల ప్రతిష్ట, కల్యాణ మహోత్సవం సందర్భంగా గురువారం తల్లాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలందరూ ఇంటి వద్ద జల బిందెలు తీసుకొనుట, గుడి వద్ద గణపతి హోమం, రుద్ర హోమం గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు సుభద్ర దంపతులతోపాటు గౌడ సంఘం పెద్దలు ఈ హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 30వ తేదీన దేవతల ప్రతిష్ట, కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు బొడ్డు రామ్ లక్ష్మణ్, బొడ్డు వెంకటేశ్వరావు, సమ్మట్ రామకృష్ణ, మొక్కా సత్యా నారాయణ, మొక్క సైదులు, , మొక్క కృష్ణార్జున్, మొక్కా బసవయ్య, రామకృష్ణ, బొడ్డు శీను,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో
గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



తానూర్, అక్టోబర్ 29(ప్రజా కలం): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీడీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డా.అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, సీనియర్ వైద్యులు డా.దామోదర్ రెడ్డి ప్రారంభించారు, నేటి పోటీ ప్రపంచంలో పుస్తక పఠనం ఎంతో కీలకమని, విద్యార్థులతో పాటు నిరుద్యోగుల కోసం డా.అనిల్ లైబ్రేరి ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎమ్మెల్యే అన్నారు, ముమ్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా విద్యామాధ్యమిక అధికారి జాదవ్ పరశురాం, ప్రిన్సిపాల్ రవికిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తోటి స్నేహితునికి ఆర్థికసాయం అందించిన పూర్వ విద్యార్థులు



తల్లాడ అక్టోబర్29 ప్రజాకలం న్యూస్ : తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి విజయ్ తల్లి ఆగ్నేశమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఆమె దశదినకర్మ గ్రామంలో నిర్వహించారు .ఈ సందర్భంగా తల్లాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో 1985-86 సంవత్సరంలో 10వ తరగతి పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితుని తల్లి మరణించడంతో ఆర్థిక సాయంగా 35వేల రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ స్నేహితులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 29:

మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని 71 ప్రాంతాల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను గుర్తించి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

ప్రతి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో చేపట్టాల్సిన పనులు, వాటి పురోగతిని సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మౌలిక సదుపాయాలన్నీ కల్పించిన అనంతరం ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, ఆ శాఖ డిప్యూటీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం!
ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

ప్రజాకలం ప్రతినిధి , ఎటపాక, అక్టోబర్ 29:

స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కన్నాయిగూడెం పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గ్రామంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీల మద్దతుతో బరిలో నిలిచిన ఎటపాక జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, ఎంపీటీసీ అభ్యర్థి తేజావత్ కౌసల్యలను



గెలిపించాలని ఆయా పార్టీల నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు మాట్లాడుతూ కన్నాయిగూడెం పంచాయతీ అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా గ్రామ పంచాయతీలకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని వారు విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, ఉచిత విద్య వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని నాయకులు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని వారు అన్నారు. కన్నాయిగూడెం పంచాయతీ ప్రజలు తమ అభ్యర్థులకు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు
నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
- అగ్నిమాపక, నిఘా వ్యవస్థలు పటిష్టంగా ఉండాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు



నిర్మల్ అక్టోబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆసువత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచడంతో పాటు అగ్నిమాపక, నిఘా వ్యవస్థలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి, వైద్య పరికరాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, ఆసుపత్రుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేసే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని, ప్రజలకు జన ఔషధి మందులపై అవగాహన కల్పించాలని తెలిపారు. టీబీ వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్య సలహాలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు
మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆర్థిక సహకారంతో యువతకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ
టాస్క్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ
శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ అవకాశాలు : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 29:

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆర్థిక సహకారంతో, నగరంలోని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందిన 50 మంది విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా టాస్క్ సంస్థ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడటంతో పాటు, వృత్తివరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మారుతున్న కాలానికి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రస్తుత శిక్షణతోనే ఆగిపోకుండా, మరింత ఉన్నత స్థాయి కోర్సులు అభ్యసిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆశించిన లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు. టాస్క్ సంస్థ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు 45 రోజుల పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ అందించినట్లు తెలిపారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడంతో పాటు, శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. యువతలోని ప్రతిభను గుర్తించి, దానికి తగిన శిక్షణ అందించడం ద్వారా వారిని ఉద్యోగాలకు సిద్ధం చేయవచ్చని తెలిపారు. మహబూబ్‌నగర్ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ, తమ ప్రతిభకు తగిన ఉద్యోగాలను సాధించి కుటుంబాలకు, సమాజానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. నైపుణ్యమే విజయానికి పునాది.. శిక్షణే ఉపాధికి మార్గం అనే లక్ష్యంతో యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్న టాస్క్ సంస్థ, మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి రాములు యాదవ్, టాస్క్ సంస్థ ఇన్‌చార్జి సిరాజ్, కోఆర్డినేటర్ సతీష్, మాజీ కౌన్సిలర్ శరత్ చంద్ర, మహ్మద్ రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంలో సోషల్ మీడియా పాత్ర, కీలకం
- జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్



మహబూబ్‌నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 29:

మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా సమీక్షా సమావేశానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ నవీన్ పెట్టెం పాల్గొనగా, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర సమన్వయకర్త ఫరీదుద్దీన్, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంలో సోషల్ మీడియా పాత్ర, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడం, పార్టీ నాయకులు నిర్వహించే కార్యక్రమాలకు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించడం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆధునిక సమాచార మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పార్టీ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజలకు మరియు పార్టీకి మధ్య సోషల్ మీడియా వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియా విభాగం మరింత చురుగ్గా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ విజయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని ఈ సమావేశంలో నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పసుల రాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అవేజ్, సీనియర్ నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు జై చంద్రశేఖర్, జవహర్ బాల్ మంచ్ (జీడీవీ) జిల్లా చైర్మన్ ఎన్. సుదర్శన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. కలీం, చర్ల శ్రీనివాస్, బూరెమోని చందు యాదవ్, బాసిద్, వినయ్ కుమార్ తదితర నాయకులతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా బృందం సభ్యులు పాల్గొన్నారు.

నీటిని, విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలి
ఎల్ నినోపై అవగాహన కల్పించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు..



తల్లాడ అక్టోబర్ 29 ప్రజ కలం న్యూస్:నీటిని, విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్ రాజు సూచించారు. గురువారం తల్లాడ మండలంలోని అన్నారు గూడెం గ్రామంలో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అధ్యక్షతన ఎల్ నినోపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉన్నందునా నీటిని, విద్యుత్ ను చాలా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గతంలో కరోనాను ఎలా ఎదుర్కొన్నావో.. ప్రస్తుతం ఎల్ నినోను కూడా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), విద్యుత్ ఏఈ ప్రసాదు, వ్యవసాయ అధికారి తాజుద్దీన్ పలు విషయాల గురించి వివరించారు. అనంతరం తల్లాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ నాయకులు ఆపతి రామారావు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు తుమ్మలపల్లి రమేష్, గడేసుల ఆనందరావు, దావీదు, ముత్తయ్య, నాయకులు పులి వెంకట నరసయ్య, తాళ్ళ అగస్టిన్, వైరా కె.వి.కె శాస్త్రవేత్తలు పావని, మనీ శ్రీ, అంగన్వాడీ టీచర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



తల్లాడ అక్టోబర్ 29 ప్రజా కలం న్యూస్

తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు కళావతి దంపతుల కుమారుడు నూతన వరుడు రవీంద్ర నూతన వధువు అంజిత వివాహం అన్నారుగూడెం మహాలక్ష్మి కళ్యాణ మండపంలో గురువారం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, అన్నారుగూడెం మాజీ వి డి సి చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సత్యవతి, తల్లాడ మండలం బీసీ సెల్ ఉపాధ్యక్షులు తోట వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పడాల రత్తయ్య, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

అర్నబ్ తుఫాన్ వల్ల పంటనష్టపోయిన
బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్



తల్లాడ, అక్టోబర్ 29: ప్రజా కలం న్యూస్ ఆరుగాలం వ్యయ ప్రయాసలు కొర్చి పండించిన పంటలు చేతికొచ్చే తరుణంలో తుఫాన్ వల్ల కోల్పోవాల్సి రావడంతో రైతులు కోలుకోలేని నష్టానికి గురి కావాల్సి వచ్చింది. తుఫాన్ ప్రభావం వల్ల ఖమ్మం జిల్లాలోని తల్లాడ, కల్లూరు ,మధిర,ఎర్రుపాలెం, వైరా, కొణిజర్ల,చింతకాని తదితర మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం బలమైన ఈదురు గాలులతో కురిసిన వర్షానికి కోత దశలో ఉన్న వరి పైరు నేలమట్టమైంది.తుఫాన్ ఈదురు గాలుల ఉధృతికి గింజ పోసుకొని కంకి దశలో కోతకు వచ్చిన వరిపైరు చాపచుట్టినట్టు నేలమట్టమై వర్షపు నీటమునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ లో జూలై మొదటి వారంలో వరి సాగు చేశారు. ఎకరానికి రూ. 25వేలు మేరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం జిల్లాలో వేలాది ఎకరాల్లో వరిపైరు తుఫాన్ వల్ల ఏపుగా పెరిగి కోతకు వచ్చిన పంటను కోల్పోవాల్సి రావడంతో రైతులు కోలుకోలేనిరీతిలో నష్టం వాటిల్లింది.వరిపైరుతోపాటు పత్తి దూది తీసే దశలోనే పత్తికాయల్లోకి నీరు చేరడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది.

మందలపల్లిలో బుల్లా శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకలు
- వధువు ప్రిన్సికి డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ఆశీర్వాదం

ఖమ్మం అక్టోబర్ 29(ప్రజా కలం న్యూస్:)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బుల్లా



శ్రీనివాసరావు, నాగేంద్రమ్మ దంపతుల కుమార్తె చి.సౌ. ప్రిన్సి వివాహ ప్రధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షులు హాజరై వధువు ప్రిన్సిని ఆశీర్వదించారు. వధువుపై అక్షింతలు చల్లి, ఆమెకు నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో కూడిన వైవాహిక జీవితం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్‌డీ మండల అధ్యక్షులు ఐయినంపల్లి గోపాలరావు, గోపయ్య, శివప్రసాద్, డేవిడ్, నరేష్, వెంకటరత్నం, కిషోర్ తదితరులు పాల్గొని వధువును ఆశీర్వదించారు.

వీరన్నపేటను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- రూ.40 కోట్లతో మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన

- వీరన్నపేటలో మరో సమీకృత గురుకుల పాఠశాల - ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

- రెండేళ్లలోపు అత్యాధునిక భవనాలు, వసతి గృహాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 29:

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కృషితోనే మైనారిటీ పాఠశాలలకు నేడు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ అన్నారు. నగరంలోని వీరన్నపేట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో రెండు మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మహబూబ్‌నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ మైనారిటీ బాలికల పాఠశాలలను తిరిగి ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాను సమకూర్చి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును మళ్లీ కార్యరూపంలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, రెండేళ్లలోపు అత్యాధునిక భవనాలు, వసతి గృహాలతో పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఒక్కో పాఠశాలలో సుమారు 600 మంది చొప్పున మొత్తం 1,200 మంది బాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వీరన్నపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కూలీలు, రిక్షా, ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లు, వ్యవసాయ కూలీలు, దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాలకు చెందిన పిల్లలు సైతం అత్యుత్తమ సౌకర్యాలతో కూడిన పాఠశాలల్లో చదువుకోవాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యాసంస్థలు ప్రధాన రహదారులపై కనిపించేలా ఏర్పాటు చేయడం కంటే, పేద కుటుంబాలకు చేరువలో ఉండి వారి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడం ముఖ్యమని అన్నారు. నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తే స్థానిక తల్లిదండ్రుల్లో తమ పిల్లలను ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలల్లో చదివించాలనే నమ్మకం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీ బాలికల కోసం రెండు గురుకుల పాఠశాలలతో పాటు, అన్ని వర్గాల పిల్లలకు విద్యావకాశాలు కల్పించేలా సమీకృత గురుకుల పాఠశాల (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విద్యాసంస్థల నిర్మాణం పూర్తయితే వీరన్నపేట ప్రాంతం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. విద్య ద్వారా పేద కుటుంబాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించడంతో పాటు, ప్రాంత అభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వీరన్నపేట మహబూబ్‌నగర్ నగరంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా, అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం సీతారామచంద్ర స్వామివారిని
దర్శించుకున్న మంత్రి పొంగులేటి

- ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యేలు



ప్రజాకలం ప్రతినిధి, భద్రాచలం, అక్టోబర్ 29:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సబ్ కలెక్టర్, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయడం, భక్తుల రాకపోకలకు అనుకూలమైన వసతులు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, భద్రాచలం క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేలా పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ అధికారికి జాయింట్ యాక్షన్ కమిటీ వినతి

- టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్ రెడ్డి



పాలేరు అక్టోబర్ 29(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండల కేంద్రంలోని ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కూసుమంచి మండల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం ఆర్టీసీ సూపరింటెండెంట్ అధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ డీఎం సమావేశంలో ఉన్నందున సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ. కూసుమంచి మండల కేంద్రం నుంచి గతంలో నడిచిన తెల్లవారుజామున 4 గంటలకు, 4.30 గంటలకు ఖమ్మం--హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సులను పునరుద్ధరించాలని కోరారు. ఈ సర్వీసులు లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు వెళ్లే రోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అన్ని ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు 24 గంటల పాటు కూసుమంచి మీదుగా నడిచేలా చర్యలు తీసుకోవాలనికోరారు. స్పెషల్ బస్సుల పేరుతో కొన్ని సర్వీసులు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజధాని బస్సులకు కూసుమంచి బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలో స్టాప్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మండల కేంద్రంలో బస్‌స్టాండ్ లేకపోవడంతో విద్యార్థులు, గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండకు, వానకు నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రయాణికుల కోసం కనీసం షెల్టర్ ఏర్పాటు చేయాలని లేదా గ్రీన్‌నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. పండుగల సమయంలో ప్రత్యేక బస్సుల పేరుతో అదనంగా 50 శాతం ఛార్జీలు వసూలు చేయడం పేద, మధ్యతరగతి ప్రయాణికులపై ఆర్థిక భారంగా మారుతోందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పండుగల వేళ అదనపు ఛార్జీలను రద్దు చేసి, సాధారణ ఛార్జీలతోనే ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికుల సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి వార్డు సభ్యులు, సీపీఐ (ఎంఎల్) నాయకులు చెరుకుపల్లి వీరయ్య, సీపీఎం నాయకులు కొక్కిరేణి వెంకన్న, అగ్రహారం వార్డు సభ్యులు, టీడీపీ నాయకులు కర్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు నివారణకు అధికారులు,
విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 29:

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, కళాశాలల ప్రతినిధులు సమష్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం సేకరించి, వాటి నివారణకు క్రియాశీలక చర్యలు చేపట్టాలని అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నివారణపై జిల్లా అధికారులు, కళాశాలల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. అన్ని కళాశాలల్లో మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడినట్లు లేదా వాటి విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా వైద్య, ఇంజినీరింగ్, విశ్వవిద్యాలయాలు, ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రవేశ సమయంలో నిర్వహించే పరిచయ కార్యక్రమాల్లోనే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన 24 కేసులు నమోదు చేసి, 32 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి పోలీసులకు సమాచారం అందించడంలో కళాశాలల యాజమాన్యాలు, ప్రతినిధులు మరింత చొరవ చూపాలని కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నట్లు తెలిసినా, వాటి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కళాశాలల పేరుప్రతిష్ఠలకు భంగం కలగకుండా, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు విద్యాసంస్థల ప్రతినిధులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, వ్యసన విముక్తి కేంద్రాలకు పంపించి చికిత్స, కౌన్సెలింగ్ అందించే చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, మరికొన్ని కేసుల్లో తదుపరి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గంజాయితో పాటు వైట్‌నర్, దగ్గు మందుల సిరప్‌లు, ఫెవికాల్ వంటి పదార్థాలను దుర్వినియోగం చేసే అవకాశాలపైనా విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కొన్ని పదార్థాల దుర్వినియోగాన్ని సాధారణ మాదకద్రవ్య పరీక్షల ద్వారా గుర్తించడం కష్టమవుతుందని, అందువల్ల విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను అధ్యాపకులు, వార్డెన్లు గమనించాలని అన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కళాశాలల ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటికే తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసు, వైద్య, సంబంధిత శాఖల సహకారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించే వ్యక్తులు, విద్యాసంస్థల పరిసరాల్లో అనుమానాస్పదంగా కార్యకలాపాలు నిర్వహించే దుకాణాలు, ఇతర వనరులపై నిఘా పెట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించిన సమాచారం సేకరించి పోలీసులకు అందించాలని సూచించారు. విద్యార్థులు ఎక్కువ సమయం కళాశాలలు, వసతి గృహాల్లో గడుపుతున్నందున అధ్యాపకులు వారి ప్రవర్తనను నిశితంగా గమనించాలని అన్నారు. విద్యార్థులు తమ పిల్లలేననే భావనతో వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, పోలీసు, వైద్య, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం నివారణకు అవగాహన కార్యక్రమాలతో పాటు సమస్యలను గుర్తించడం, బాధితులకు తగిన సహాయం అందించడం, వాటి సరఫరా వనరులను అరికట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పై. మధుసూదన్ నాయక్, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, డి.డబ్ల్యూ.ఓ జరీన బేగం, కళాశాలల ప్రతినిధులు, ప్రిన్సిపాల్ లు, ఎన్. జి. ఓ ప్రతినిధులు, విద్య శాఖ, వైద్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో 100% ఫలితాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 29 (ప్రజా కలం):

పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం గద్వాల మండలం కొండపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలించారు.

గతంలో 90 శాతం ఉత్తీర్ణత నమోదైన నేపథ్యంలో ఈసారి వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రతి రోజూ సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ముఖ్యంగా గణితం, భౌతికశాస్త్రంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని, వంటశాల పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. గురువారం మెనూ ప్రకారం వంట చేయకపోవడంతో సంబంధిత ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీని నియమించాలని సూచించారు. విద్యార్థులందరికీ సరిపోయే యూనిఫాంలు, అవసరమైన పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్పంచులు, ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలల ను తరచూ సందర్శించి పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యవసాయా నికి నీటి సరఫరా తదితర అంశాలపై సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, డీఈవో విజయలక్ష్మి,గద్వాల మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



మహబూబ్‌నగర్, ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 29:

మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని బొక్కలోనిపల్లి గ్రామంలో జన్నప్పపల్లి గ్రామానికి సంబంధించి చేపడుతున్న భూ సర్వే ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన గ్రామసభ/అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ పాల్గొన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీ-సర్వే ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. భూముల కొలతలను ఖచ్చితంగా నిర్వహించి, భూహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఆధునిక రోవర్ సర్వే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు వివరించారు.భూ రీ-సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (స్రూవీం), భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం పెరగడంతో పాటు, భూముల సరిహద్దులపై స్పష్టత ఏర్పడుతుందని, భవిష్యత్తులో భూ యాజమాన్యం, భూ హద్దులకు సంబంధించిన వివాదాలను నివారించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.భూ రీ-సర్వే ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా పూర్తయ్యేందుకు గ్రామస్థులు రెవెన్యూ, సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కోరారు.

నందిన్నె గ్రామంలో గృహప్రవేశ వేడుకకు
హాజరైన బాసు హనుమంతు నాయుడు



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 29 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా, కేటీ దొడ్డి మండలం నందిన్నె గ్రామంలో డ్రైవర్ వీరన్న నూతన గృహప్రవేశ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంట్లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని, వీరన్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాసు హనుమంతు నాయుడును ఇంటి యజమాని వీరన్న శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాకి దేవిడ్, బాసు గోపాల్, అంజి, నూర్ పాషా, నరసింహులు, గోవిందు, తిమ్మప్ప, రాముడు, మల్లికార్జున్, మహేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వివక్షను జయించి వైద్యరంగంలో రూత్ జాన్ పాల్ చరిత్ర

రూత్ సంకల్పం ఎందరికో స్ఫూర్తిదాయకం: సీపీ సజ్జనార్

ఖమ్మం అక్టోబర్ 29(ప్రజా కలం న్యూస్) ఖమ్మం నగరంలోని పేదరికం, సామాజిక వివక్షను అధిగమించి ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తి చేసిన దేశంలోనే



తొలి ట్రాన్స్ మహిళగా డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ అరుదైన ఘనత సాధించారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. ఖమ్మం రమణగుట్టకు చెందిన రూత్ ఎన్నో కష్టాలను ఎదుర్కొని పట్టుదలతో తన లక్ష్యాన్ని చేరుకున్నారని కొనియాడారు. ప్రస్తుతం సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యురాలిగా సేవలందిస్తూ ప్రాణాలను కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే అడ్డంకులను అధిగమించి ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని రూత్ నిరూపించారని సజ్జనార్ అభినందించారు.

కాంగ్రెస్‌లో కష్టపడ్డందుకు కార్యకర్తలకు అన్యాయంగా సస్పెండ్ చేస్తారా?

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకేనా...
- కొయ్యూరు ఉపసర్పంచ్ లకావత్ సవేందర్...



మల్హర్, అక్టోబర్ 29 ప్రజాకలం ప్రతినిధి... కాంగ్రెస్ పార్టీ కోసం 20 ఏళ్లుగా కష్టపడి పనిచేసిన తమను సస్పెండ్ చేయడం అన్యాయమని మల్హర్ మండలం కొయ్యూరు గ్రామ ఉపసర్పంచ్ లకావత్ సవేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొయ్యూరు లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కొయ్యూరులో ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్న స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి హాజరైనందుకే తమపై సస్పెన్షన్ వేటు వేశారని సవేందర్‌తో పాటు బాధితులు ఆరోపించారు. ఉపసర్పంచ్ సవేందర్, వార్డు సభ్యులు లకావత్ లక్ష్మీ, తిరుపతి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖలీంపై పార్టీ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.సొంత పార్టీ ఎంపీ కార్యక్రమానికి హాజరుకావడంలో తప్పేముందని ప్రశ్నించిన వారు, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వాన్ని కలిసి తమ వాదన వినిపిస్తామని వెల్లడించారు.

వర్షానికి నేలకొరిగిన వరి పంట పరిశీలన

- రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు




పాలేరు అక్టోబర్ 29(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలం పరిధిలోని గురువారం గట్టుసింగారం, పెరికసింగారం, తుమ్మలతండా గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి నేలకొరిగిన వరి పంటను సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్, మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి పరిశీలించారు. నీటిలో మునిగిన పొలాల్లో నిల్వ నీటిని వెంటనే తొలగించి పొలాలను ఆరనివ్వాలని రైతులకు సూచించారు. పంట పరిస్థితిని బట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పెరికసింగారంలో యాసంగి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్ లో ఎంపీ వంశీకృష్ణ పర్యటనలో భాగంగా కాంగ్రెస్‌లో సస్పెన్షన్ సెగ!

ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన వారిపై చర్యలు ఎందుకు
కార్యకర్తల సస్పెన్షన్‌పై మంత్రి శ్రీధర్‌బాబుకు ఎంపీ వంశీకృష్ణ లేఖ

మల్హర్, అక్టోబర్ 29 ప్రజాకలం ప్రతినిధి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొయ్యూరు పర్యటనలో పాల్గొన్నందుకే కొయ్యూరు ఉప సర్పంచ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను సస్పెండ్ చేశారన్న ప్రచారంతో మండలంలో రాజకీయ వేడి రాజుకుంది. సొంత పార్టీ ఎంపీ కార్యక్రమానికి హాజరైతే సస్పెండ్ చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం అన్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలకు ఇప్పుడు ఈ పరిస్థితి ఎదురుకావడంపై పలువురు ప్రజాస్వామ్యవాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై స్పందించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బాధిత కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు లేఖ రాసినట్లు తెలిసింది. కార్యకర్తల సస్పెన్షన్ వ్యవహారం రాష్ట్ర కాంగ్రెస్‌లోనూ చర్చనీయాంశంగా మారింది.మరి ఈ వ్యవహారంపై మంత్రి శ్రీధర్‌బాబు ఎలా స్పందిస్తారు? సస్పెన్షన్‌కు గురైన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందా? అన్నది వేచి చూడాలి.



పర్వతగిరిలో కాంగ్రెస్ పార్టీ కి షాక్

- బిఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ అసంతృప్తి మండల సీనియర్ క్యాడర్
- గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే అరూరి



(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 29, ప్రజాకలం ప్రతినిధి: గురువారం పర్వతగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ గూటికి చేరారు. చేరిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ జూలపెల్లి గంగాధర్ రావు, ఇండిపెండెంట్ సర్పంచ్ కాంటెస్ట్ అభ్యర్థి సింగారపు రమేష్, సీనియర్ నాయకులు జూల్లపెల్లి సురేందర్ రావు, జూల్లపెల్లి సోమేశ్వర్ రావు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు కాంటెమ్ సుధాకర్, మైనార్టీ మండల నాయకురాలు షేక్ సుల్తాన, మాజీ నాయిని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు జిల్లా శ్రీనివాస్, మండల మాజీ మైనార్టీ అధ్యక్షులు ఎండి గౌస్ పాషా, మాజీ యూత్ వైస్ ప్రెసిడెంట్ చింతకుంట్ల రంజిత్, మాజీ వార్డు సభ్యులు చిరుకొండ వీరస్వామి, ముదిదేన దేవేందర్, కొలుగూరి సంతోష్ రావు, వడ్డేపల్లి వెంకటేశ్వర్లు, బొట్ల అనిల్ బీఆర్ఎస్ పార్టీ లోకి చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అరిగోస పడుతున్నారు, రేవంత్ రెడ్డి అబద్దాల మాటలతోనే పరిపాలన కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు పరిచడో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు, తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల కరెంటు సరఫరా కేవలం 6 గంటలకే పరిమితమైంది అన్నారు. రైతుల బాగు కోసం ఆలోచించని రైతు ద్రోహి దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై నమ్మకంతో గతంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు ఫలితంగా రాష్ట్ర ప్రజలు గులాబీ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. నేడు పార్టీలో చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ సొసైటీ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు బోయినపల్లి యుగంధర్ రావు, పుట్టపురం ఏకాంతం గౌడ్, మాజీ మండల అధ్యక్షులు రంగు కుమార్, మండల మాజీ రైతు బంధు అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్, సీనియర్ నాయకులు చీమల బిక్షపతి, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, సర్పంచులు ఏర్పుల శ్రీనివాస్, డెక్క నునీత కుమారస్వామి, మాజీ ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ గ్రామ మాజీ శాఖ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా సమన్వయంతో అధికారులు ముందుకు సాగాలి
ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లు, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

పాలేరు అక్టోబర్ 29 (ప్రజా కలం న్యూస్)

పాలేరు నియోజకవర్గం లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పెండింగ్ లేకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గం ఏదులాపురం మున్సిపాలిటీ మద్దుపల్లి లో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. నిర్ణీత సమయానికి, క్వాలిటీ తో వేగంగా నిర్మాణాలు జరగాలని, కార్మికులను పెంచి అనునంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, విద్య, వైద్యం అభివృద్ధికి కీలకమైన కళాశాల భవనాల నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకుండా, ఇంజనీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పనుల సందర్భంగా అవసరమైన నిర్మాణ సామగ్రి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని, ప్రతి దశను ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి



పనుల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనతరం వెంకటగిరి లో అసంపూర్తిగా ఉన్న జి పస్ల్ 2 భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మద్దులపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దారు వినయేంద్రరెడ్డి, వైద్యశాఖ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టార్గెట్ మిషన్ 100



హైదరాబాద్ : మరోసారి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ గట్టిగా ట్రై చేస్తోంది. క్షేత్రస్థాయి సమీకరణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సంస్థాగత బలాన్ని నమ్ముకుని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో '100 సీట్లు' సాధించడమే లక్ష్యంగా హస్తం పార్టీ అడుగులు వేస్తోంది. తాజాగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో ఇదే విషయాన్ని వెల్లడించారు. బీఆర్ఎస్, బీజేపీలపై నిప్పులు చెరిగిన ఆయన.. కాంగ్రెస్ పునరాగమనంపై తిరుగులేని ధీమాను వ్యక్తం చేశారు.ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ గ్రౌండ్ రియాలిటీని విస్మరించి బతుకుతోందని మహేష్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీష్ రావులు వాస్తవాలు తెలుసుకోకుండా ఇంకా అధికార దర్పం తాలూకు భ్రమల్లోనే ఉన్నారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులకు కారణమైన ప్రకృతి విపత్తు ఎల్ నినో ప్రభావాన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటూ హరీష్ రావు అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను అందరూ మేధావి అనుకుంటారని, కానీ భవిష్యత్తుపై కనీస ఆలోచన లేకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందే ఆయనని ధ్వజమెత్తారు.ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రస్తుత పాలనాపరమైన, ప్రజల సమస్యలన్నింటికీ నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి పరిష్కారం లభిస్తుందని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. నవంబర్ తర్వాత నుంచి కాంగ్రెస్ శ్రేణులు పూర్తిస్థాయి ఎన్నికల మోడ్‌లోకి వెళ్లనున్నాయి. ఎమ్మెల్యేలు ఇప్పటికే గ్రౌండ్‌లో దూకుడు పెంచారని, ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న ఆదరణకు నిదర్శనమని గుర్తుచేశారు. "ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ ప్రజా క్షేత్రంలో నిలిచే పార్టీ మాత్రమే శాశ్వతం. కాంగ్రెస్‌కు ఉన్న అసలైన బలం దాని సంస్థాగత పునాదే" అని ఆయన తేల్చిచెప్పారు.ప్రభుత్వానికి, పార్టీకి మధ్య ఉన్న సమన్వయంపై వస్తున్న ఊహాగానాలకు మహేష్ కుమార్ గౌడ్ గట్టిగా చెక్ పెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ వ్యవహారాల్లో తనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని తెలిపారు. సీఎం, పీసీసీ అధ్యక్షుడి మధ్య ప్రస్తుతం ఉన్నంతటి పరస్పర సమన్వయం, సయోధ్య దేశంలో ఏ రాష్ట్రంలోనూ కనిపించదని స్పష్టం చేశారు. నాయకుల మధ్య అంతర్గత కలహాలకు తావులేకుండా ఒకే తాటిపై నడుస్తున్నామని వెల్లడించారు.రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ ప్రచారం చేసుకుంటున్న బీజేపీ పై పీసీసీ చీఫ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్నారు. ప్రస్తుతం బీజేపీకి ఉన్న 8 మంది లోక్‌సభ ఎంపీల్లో ఇద్దరు గెలిస్తేనే ఎక్కువని, అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా తిరిగి గెలవరని జోస్యం చెప్పారు. ముఖ్యంగా బీజేపీ బలంగా భావించే ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో కనీసం 40 శాతం అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుని తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. అర్హులైన పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ, వేలాది మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో లబ్ధిదారులంతా కాంగ్రెస్ వెంటే ఉన్నారని చెప్పారు.

ఇండో-శ్రీలంక మైత్రి సేతు సైకిల్ యాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఇండో-శ్రీలంక మైత్రి సేతు అంతర్జాతీయ సైకిల్ యాత్రలో భాగంగా డిసెంబర్ 22న నిర్మల్ జిల్లాకు చేరుకోనున్న సైక్లింగ్ బృందానికి ఘన స్వాగతం పలికేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాకు చేరుకునే సైక్లింగ్ బృందానికి తగిన వసతి, ఆతిథ్య సౌకర్యాలు కల్పించాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. సైకిల్ యాత్ర ఆదిలాబాద్ జిల్లా వైపు వెళ్లేందుకు అనువైన రూట్ మ్యాప్‌ను రూపొందించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఇండో-శ్రీలంక మైత్రి సేతు సైకిల్ యాత్ర వంటి అంతర్జాతీయ కార్యక్రమాలు ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. యాత్ర విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, 32వ బెటాలియన్ ఎన్‌సీసీ ప్రతినిధి సంజీవ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గద్వాల డిపోలో కార్మికుల సమస్యల పరిష్కారానికి భరోసా

-డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 29 (ప్రజా కలం): గద్వాల ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ శ్రవణ్ కుమార్‌ను తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీఎఫ్) గద్వాల డిపో కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు తమను పరిచయం చేసుకొని, డిపోకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ డిపోలో నెలకొన్న సమస్యలు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. డిపో అభివృద్ధికి, మెరుగైన సేవలకు అందరూ సహకరించాలని కోరారు.నూతన డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించడంపై టీఎఫ్ డిపో కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

లోవోల్టేజీ సమస్యకు చెక్.. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన సర్పంచ్!



గద్వాల ప్రతినిధి అక్టోబర్ 29 (ప్రజా కలం):జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం కుర్తిరావల్ చెరువు గ్రామంలోని గురువారం బీసీ కాలనీలో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ కె. భగవంతు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కె. భగవంతు మాట్లాడుతూ.. బీసీ కాలనీలో లోవోల్టేజీ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో కాలనీలో లోవోల్టేజీ సమస్య పరిష్కారమై ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాఘవేంద్ర గౌడ్, గ్రామ నాయకులు కె. ధనుంజయ, పరశురాముడు, తిమ్మప్ప, పుల్లూరు కర్ణాకర్, రామన్న, లైన్‌మెన్ దర్శిల్లి తదితరులు పాల్గొన్నారు.

పత్తి పొలాల్లో 14 మంది బాల కార్మికులకు విముక్తి

- ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 29 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో పత్తి విత్తనాల పొలాల్లో పనుల కోసం తరలిస్తున్న 14 మంది బాలలను కార్మిక శాఖ అధికారులు గురువారం రక్షించారు. వీరిలో నెతోనిపల్లికి చెందిన 8 మంది, ఆలూరుకు చెందిన 3 మంది, పెద్దెడ్డికి చెందిన 2 మంది, అరగిద్దకు చెందిన ఒకరు ఉన్నారు. ఈ ఘటనపై ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి. వేణుగోపాల్ తెలిపారు. రక్షించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, అనంతరం చైల్డ్ హోమ్‌కు తరలించారు. బాలలను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.



ఢిల్లీ పోరుకు కాంగ్రెస్ కదనభేరి

- నవంబర్ 1న రాంలీలా మైదానంలో భారీ ధర్నా..

- కాంగ్రెస్ బస్సుకు జెండా ఊపిన కాట దంపతులు..

- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ఢిల్లీ బాట..

పటాన్‌చెరు, అక్టోబర్ 29 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజాస్వామ్యంపై దాడిని సహించేది లేదంటూ పటాన్‌చెరు కాంగ్రెస్ శ్రేణులు సమరశంఖం పూరించాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలోని చారిత్రక రాంలీలా మైదానంలో



జరగనున్న భారీ ధర్నాలో పాల్గొనేందుకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు ఢిల్లీ బాట పట్టారు. ఢిల్లీకి బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణుల బస్సును పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి జెండా ఊపి ప్రారంభించారు. ప్రజాస్వామ్య పరిరక్షణే మా లక్ష్యం అనే నినాదాలతో కార్యకర్తలు హోరెత్తించడంతో పరిసరాలు దద్దరిల్లాయి. ప్రజాస్వామ్య రక్షణ పోరులో పటాన్‌చెరు శ్రేణులు ముందు వరుసలో నిలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా కాట దంపతులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే నిర్ణయాలను ఏమాత్రం సహించబోమని, వాటిని కాంగ్రెస్ పార్టీ గట్టిగా ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఈ పోరాటంలో నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగే ధర్నాను చారిత్రాత్మకంగా విజయవంతం చేసి, ప్రజాస్వామ్యం పట్ల కాంగ్రెస్ నిబద్ధతను దేశానికి చాటిచెప్పాలని కోరారు..

నిరుపేదలకు సీఎం సహాయనిధి భరోసా

- ఇద్దరు రోగులకు రూ.2.75 లక్షల సాయం..

పటాన్‌చెరు, అక్టోబర్ 29 (ప్రజా కలం) ప్రతినిధి

ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం చేయించుకోలేని పేదలకు ఈ సాయం ఎంతో



ఊరటనిస్తోందని పేర్కొన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమల గ్రామానికి చెందిన పాపయ్యకు రూ. 1.25 లక్షలు, భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీకి చెందిన పసుపుల విక్రమ్‌కు రూ. 1.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న వీరు ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, మొత్తం రూ. 2.75 లక్షల సాయం మంజూరైంది. ఈ మేరకు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆర్థిక సాయానికి సంబంధించిన పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు..


మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కి సన్మానం చేసిన సింగరేణి అధికారులు

కమాన్ పూర్ : సింగరేణి అధికారుల సంక్షేమానికి సంబంధించిన సీఎంఓఏఐ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వాటిని పరిష్కరించే దిశగా విశేష కృషి చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి సీఎంఓఏఐ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారుల దీర్ఘకాలిక, న్యాయమైన డిమాండ్ల విషయంలో మంత్రి చూపిన చొరవ, బొగ్గు బెల్ట్ ప్రాంత అధికారుల పట్ల ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా తీసుకెళ్లిన తీరుఅభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ మేరకు సీఎంఓఏఐ ప్రెసిడెంట్ తాళ్ళపల్లి. లక్ష్మీపతి గౌడ్ ఆధ్వర్యంలో, ఆర్ జి-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, బి ఈ సి జనరల్ సెక్రటరీ పెద్ది నర్సింహులు, వైస్ ప్రెసిడెంట్, పొనుగంటి శ్రీనివాస్, ఆర్జీ-2 ప్రెసిడెంట్, మాలోత్ రాముడు, ఆర్జీ-3 ఏరియా ప్రెసిడెంట్ కోలా శ్రీనివాస్, ఆర్జీ-2 ఏరియా సెక్రటరీ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, ట్రెజరర్ విశాల్, జాయింట్ ట్రెజరర్ భాస్కర్ రెడ్డి తదితర నాయకులు మరియు అధికారులు మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు.ఈ సందర్భంగా మంత్రి కి పుష్పగుచ్ఛం అందజేసి, గజమాలతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి, అధికారుల సంక్షేమానికి మంత్రి అందిస్తున్న సహకారం ఇదే విధంగా కొనసాగాలని కోరుకుంటూ, ఈ పరిష్కారం కేవలం ఒక సంఘం విజయం కాదని, ఇది మనందరి సమష్టి విజయం అని వారు తెలియజేశారు.

భారతీయ జనతా పార్టీ మహేశ్వరం మండల శాఖ

- మహేశ్వరం మండల బీజేపీ పదాధికారుల సమావేశం

- ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు,మహా పాదయాత్రపై చర్చ



మహేశ్వరం, అక్టోబర్ 29, (ప్రజా కలం): భారతీయ జనతా పార్టీ మహేశ్వరం మండల శాఖ ఆధ్వర్యంలో మండల పదాధికారుల సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ, రాబోయే పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ప్రధానంగా చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా మండల వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఓటర్ల నమోదు ప్రక్రియను సమన్వయంతో వేగవంతం చేయాలని పదాధికారులకు సూచించారు. అలాగే నవంబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్ర విజయవంతంపై చర్చించారు. ఈ మహా పాదయాత్రలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. మండలంలోని పార్టీ నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ భారీ సంఖ్యలో తరలి రావాలని నిర్ణయించారు. పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి పదాధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బొక్క నర్సింహా రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు బస్వ పాపయ్య గౌడ్, మహేశ్వరం ఇంచార్జ్ పోనేటి నర్సింహా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దేశ్యా నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు, సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్, జిల్లా కార్యదర్శి ఆకుల యాదయ్య గౌడ్, కాసాని వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, మండల కార్యదర్శులు బొమ్మ దేవేందర్, పోల్కం మహేందర్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్ర పాండు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు గోల్లూరు మాధవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు రఘువీర్, యువ మోర్చా అధ్యక్షులు వినోద్ నాయక్, సర్పంచ్ యాదమ్మ యాదయ్య, దేవేందర్ నాయక్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, శక్తి కేంద్ర ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గృహ కార్మికుల హక్కుల పోరాటానికి గళం

- శ్రమకు గుర్తింపు.. హక్కులకు రక్షణే లక్ష్యం..

- భారత్, దక్షిణాఫ్రికా ఉద్యమాలపై సోనాల్ శర్మ కీలక వ్యాఖ్యలు..




పటాన్‌చెరు, అక్టోబర్ 29 (ప్రజా కలం) ప్రతినిధి

గృహ కార్మికుల శ్రమకు గుర్తింపు, హక్కులకు చట్టబద్ధ రక్షణ, గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే డిమాండ్లతో భారత్, దక్షిణాఫ్రికాలో సాగుతున్న ఉద్యమాలు సామాజిక మార్పునకు బాటలు వేస్తున్నాయని అమెరికాలోని టఫ్ట్స్ విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్ర విభాగం సహాయ ఆచార్యురాలు, న్యూఢిల్లీలోని విధాన పరిశోధన కేంద్రం అతిథి పరిశోధకురాలు డాక్టర్ సోనాల్ శర్మ అభిప్రాయపడ్డారు.గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలోని ఆసియా అధ్యయన కేంద్రం పట్టణీకరణ, లింగం, శ్రమ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాసంలో ఆమె మాట్లాడారు.ఇళ్ల నుంచి వీధుల వరకు.. భారత్,దక్షిణాఫ్రికాలో గృహ కార్మికుల ఉద్యమాల్లో వ్యక్తీకరణ అంశంపై తన పరిశోధన అనుభవాలను వివరించారు. శ్రమ, వర్గం, కులం, జాతి, లింగ వివక్షలు గృహ కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆమె పేర్కొన్నారు.తమ హక్కులు,సామాజిక గుర్తింపు కోసం వారు సాగిస్తున్న పోరాటాల్లో కుల వ్యతిరేక ఉద్యమాలు, స్త్రీవాద భావజాలం, నల్లజాతి చైతన్యం కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. గృహ కార్మికులకు గౌరవం, న్యాయం, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యతలను కూడా ఆమె విశ్లేషించారు.కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు వారి శ్రమకు తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.ఈ కార్యక్రమాన్ని ఆంగ్లం, ఇతర భాషల విభాగం సహాయ ఆచార్యురాలు,పట్టణీకరణ, లింగం, శ్రమ విభాగం సమన్వయకర్త డాక్టర్ దేబాద్రితా చక్రవర్తి, దృశ్య ప్రసార మాధ్యమాల అధ్యయన విభాగం సహాయ ఆచార్యురాలు డాక్టర్ సుసాన్ కోషి సమన్వయం చేశారు..

దేవి రవీందర్‌ను పరామర్శించిన హరీష్ రావు

బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి విమర్శలు



గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి): దనరా పండుగ రోజున రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ కారుపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత,మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు గురువారం గజ్వేల్ నియోజకవర్గంలోని లకుడారం గ్రామంలో దేవి రవీందర్‌ను పరామర్శించారు.ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, ఆయనకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడు తూ,ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేయ డం,దాడులకు పాల్పడటం సరికాదని అన్నారు. ఇలాంటి ఘటనలు కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజల హక్కు అని పేర్కొన్నారు.బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హరీష్ రావు అన్నారు.మరో రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుం దని ధీమా వ్యక్తం చేశారు.పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడిన వారికి ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెబుతామని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని, ప్రజా సమస్యలపై తమ పార్టీ తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్,బక్కి వెంకటయ్య, గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ప్రాంతాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చాలి

రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి: కొట్టాల యాదగిరి



గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ నియోజకవర్గంలోని అర్హమైన మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చాలని తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు.కరువు మండలాల గుర్తింపుపై రైతులకు స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మల్లన్నసాగర్,కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల నిర్మాణంతో ఈ ప్రాంతానికి కలిగిన ప్రయోజనాలు,ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా పరిశీలించాలని యాదగిరి సూచించారు. కరువు మండలాల గుర్తింపుపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. రిజర్వాయర్ల నిర్మాణంతో భూములు,నివాసాలు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించి,వారి సమస్యలను పరిష్కరించాలని యాదగిరి కోరారు.మల్లన్నసాగర్ నిర్వాసితులను గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేసిన నేపథ్యంలో వారిపై పన్నుల భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరువు మండలాల గుర్తింపు,నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ ఎర్ర నర్సింలు,గజ్వేల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగని రాజు,పట్టణ యువజన అధ్యక్షుడు కూరాకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఆటోమొబైల్‌తో కొత్త శకం

- పటాన్‌చెరులో నేషనల్ ఆటోమొబైల్ ప్రారంభంతో కొత్త సందడి..

- షేక్ సోయల్‌కు పాత్రికేయుల అభినందనల వెల్లువ

- పూలమాల, శాలువాతో ఘన సత్కారం..

- నూతన వ్యాపారానికి శుభాకాంక్షలు వెల్లువ..



పటాన్‌చెరు, అక్టోబర్ 29 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు పట్టణ వ్యాపార రంగంలో కొత్త సంచలనం మొదలైంది! ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాల దుకాణాల సముదాయంలో నేషనల్ ఆటోమొబైల్ దుకాణం అట్టహాసంగా ప్రారంభమై, పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.దుకాణ యజమాని షేక్ సోయల్ తన సొంత వ్యాపారంతో ఆర్థికంగా ఎదగాలనే పట్టుదలతో వేసిన ఈ సాహసోపేత అడుగుకు అభినందనల వెల్లువ కురిసింది. ప్రారంభోత్సవానికి సీనియర్ పాత్రికేయులు నర్ర రామారావు, ప్రజాతంత్ర రాజు, సయ్యద్ మజీద్ అలీ, షేక్ సలీం హాజరై సోయల్‌ను పూలమాలతో సత్కరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ, సొంతంగా వ్యాపారం ప్రారంభించి ఎదగాలనే లక్ష్యంతో ముందడుగు వేయడం నిజంగా అభినందనీయం. వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకుంటూ,నాణ్యమైన సేవలతో వ్యాపారాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి అని ఆకాంక్షించారు. పట్టణంలో ఇలాంటి కొత్త వ్యాపార సంస్థలు ఏర్పాటవడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని వారు అభిప్రాయపడ్డారు. పటాన్‌చెరు వ్యాపార రంగంలో నేషనల్ ఆటోమొబైల్ కొత్త చరిత్ర సృష్టిస్తుందనే చర్చ పట్టణంలో జోరుగా సాగుతోంది..

ఉప్పల్‌లో భారీ చోరీ..

30 తులాల బంగారం, రూ.6 లక్షలు అపహరణ

ఉప్పల్ : ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు దేవస్థానానికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని దుండగుడు తాళాలు పగలగొట్టి భారీ చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ భరత్‌నగర్ కాలనీలో జరిగింది. దాదాపు 30 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.6 లక్షల నగదును అపహరించినట్లు సమాచారం. కాలనీకి చెందిన భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కొమరవెల్లి దేవస్థానానికి వెళ్లారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో బుర్కా ధరించిన ఓ వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు.బీరువాను తెరిచి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లాడు. దాదాపు గంటపాటు ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. తెల్లవారుజామున ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన పనిమనిషి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు హుటాహుటిన ఇంటికి చేరుకుని చూడగా, బీరువా తెరిచి ఉండటంతో పాటు సామగ్రి చిందరవందరగా పడి ఉంది. చోరీకి పాల్పడిన వ్యక్తి కదలికలు, తాళాలు పగలగొడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు

సివిల్ సప్లయ్ శాఖలో అవినీతి అధికారులపై

కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ : సివిల్ సప్లయ్ శాఖలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వారి అక్రమాస్తులను జప్తు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లర్లపై జరుగుతున్న దాడులు, కేసుల నమోదును స్వాగతిస్తున్నామని, అధికారుల అండదండలు లేకుండా మిల్లర్లు అవినీతికి ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. వనపర్తి జిల్లాలో అను మతులు లేవంటూ రెండు రైస్ మిల్లులను కూల్చివేసిన అధికారులు, వాటికి ధాన్యం కేటాయింపులుఎలా చేశారో సమాధానం చెప్పాలన్నారు. శాఖలోని డీఎంలు, డీఎస్‌వోలు ఒక్కో సీజన్‌లో రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. మిల్లర్ల మాదిరిగానే అధికారులపైనా ఏసీబీ, సీఐడీ సోదాలు నిర్వహించాలని కోరారు. అవినీతి అధికారుల అక్రమాస్తులు, బినామీల వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

నవంబరు 1న 'మాదిగ మహారాజుల శోభాయాత్ర'-జయప్రదం చేయాలని సుమన్ మహారాజ్ పిలుపు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 29:

ఆది జాంబవ మహారాజుల ఆశయాలను చాటుతూ, మాదిగ జాతి ఐక్యతను ప్రదర్శించేందుకు వచ్చే నెల (నవంబరు) 1న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 'మాదిగ మహారాజుల శోభాయాత్ర'ను ఘనంగా నిర్వహించనున్నట్లు



మాదిగ జాగృతి సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలు, మతాలకు అతీతంగా మాదిగలంతా ఏకతాటిపైకి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుమన్ మహారాజ్ పిలుపునిచ్చారు.

మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ)ల సహకారంతో ఈ శోభాయాత్ర జరగనుంది. నవంబరు 1వ తేదీ (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలో ఈ ప్రదర్శన ప్రారంభమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. విశారదన్ మహారాజ్ హాజరుకానున్నారు. జిల్లాలోని మాదిగ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంజేఎస్ నాయకులు నాగేశ్వర్ రావు, సంతోష్, రాజు, బాగేంద్ర, మహేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు: ఆర్మూర్‌లో ఘనంగా భారీ రక్తదాన శిబిరం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 29:

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆర్మూర్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పెర్కిట్‌లోని ఎం.ఆర్. గార్డెన్స్‌లో భారీ రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి పలువురు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు.



ఈ కార్యక్రమానికి అదనపు డీసీపీ శుభం నాగ్రాలే, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, రక్తదాన శిబిరాన్ని సందర్శించి కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఇలాంటి రక్తదాన శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గోనే లహరి రఘు, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, ఆర్మూర్ రూరల్ సీఐ, భీంగల్ సీఐ, ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

-జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్





యాదాద్రి/రామన్నపేట అక్టోబర్ 29 ప్రజాకలం:పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని,జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రామన్నపేటలో 2కె రన్ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై,స్వయంగా రన్‌లో ముందుండి పాల్గొని పోలీసు అధికారులు,సిబ్బంది,విద్యార్థులు యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ.ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని సూచించారు.పోలీసు విధుల్లో శారీరక దారుఢ్యం,క్రమశిక్షణ అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు.విద్యార్థులు,యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఫిట్‌గా ఉండేందుకు నిత్యం వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు.దేశ రక్షణ,ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా,ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, పోలీసు శాఖకు-ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ 2కె రన్ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, రామన్నపేట సీఐ రవి,ఎస్ఐ సతీష్,ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు,వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి,ఆత్మకూరు (ఎం) ఎస్ఐ లక్ష్మీ నారాయణ,మోత్కూరు ఎస్ఐ సతీష్,అడ్డగూడూరు ఎస్ఐ వెంకట్ రెడ్డి,ఏఎస్ఐ సురేందర్,హెడ్ కానిస్టేబుళ్లు కమలాకర్,వెంకటేశ్వర్లు,పోలీసు సిబ్బంది లింగస్వామి, స్వామి నాయక్,ప్రవీణ్,ప్రశాంత్,స్వామి,మధు, కృష్ణమూర్తి, నరసింహ,లావణ్య, కవిత,సైదులు,సైదయ్య,స్థానిక కళాశాలల విద్యార్థులు,ప్రజా ప్రతినిధులు,ప్రజలు,వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో ఘోర రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్న మహేశ్వరం పోలీసులు

న్యాయం చేయాలంటూ బాధ్యత కుటుంబ సభ్యులు ధర్నా



మహేశ్వరం, అక్టోబర్ 29, (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో కేతావత్ రాహుల్ (22) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మండల కేంద్రంలోని విప్రో కంపెనీ సమీపంలోలి ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న రాహుల్ ను వేగంగా వచ్చిన బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలై, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదం విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు కోరుతున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేయాలి

- పట్టభద్రుల ఓటరు నమోదుపై రాజకీయ పార్టీలకు సూచనలు చేసిన కందుకూరు ఏఈఆర్ఓ, ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి



కందుకూరు, అక్టోబర్ 29, , (ప్రజా కలం):

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఏఈఆర్ఓ మరియు ఆర్డీఓ కందుకూరు సూచించారు.ఈ మేరకు బుధవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఓటరు జాబితా తయారీ, నూతన నమోదు విధానం, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కీలక విషయం స్పష్టం చేశారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాను డీనోవో పద్ధతిలో పూర్తిగా నూతనంగా తయారు చేస్తున్నందున, గతంలో ఓటరుగా నమోదై ఉన్నవారు సైతం ప్రస్తుత ప్రక్రియలో మళ్లీ దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. పాత జాబితా చెల్లదని, తాజా జాబితాలో పేరు నమోదు కావాలంటే నిర్దేశిత విధానంలో కొత్తగా దరఖాస్తు సమర్పించాల్సిందేనని స్పష్టం చేశారు.

తమ పార్టీల పరిధిలోని పట్టభద్రులు, ఉద్యోగులు, విద్యావంతులు, యువతకు ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించాలి.

గతంలో ఓటరుగా ఉన్నవారు కూడా తాజా డీనోవో ప్రక్రియలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి.అర్హులైన పట్టభద్రులు నిర్ణీత ఫారం-18 నింపి, విద్యార్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు సమర్పించేలా అవగాహన కల్పించాలి.ఓటరు నమోదు విషయంలో ఎలాంటి అపోహలు ఉన్నా, ఎన్నికల అధికారుల ద్వారా సరైన సమాచారం తెలుసుకుని ప్రజలకు తెలియజేయాలి.పట్టభద్రుల ఓటరుగా నమోదు కావాలంటే భారత పౌరులై, సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసి అయి ఉండాలి. నిర్దేశిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు నుంచి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి.దరఖాస్తుకు ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత ఎన్నికల అధికారులకు నేరుగా అందజేయవచ్చు. దరఖాస్తుతో పాటు డిగ్రీ సర్టిఫికెట్, ఇతర నిర్దేశిత పత్రాలను జత చేయాలి.

తాజా ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 6 నవంబర్ 2026 గా ప్రకటించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, గడువులోగా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘాలు సహకరించాలని కోరారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు



బీబీనగర్, అక్టోబర్ 29 (ప్రజాకలం): వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోనం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు టంటం రాఘవేందర్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు బీబీనగర్--పోచంపల్లి రోడ్డులోని బెంగళూరు బేకరీ వద్ద శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఇందుకోసం పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు, డిగ్రీ ధ్రువపత్రం, ఓటరు గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. 1 నవంబరు 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు, నిబంధనల ప్రకారం అర్హత ఉంటే నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

అదనపు కలెక్టర్ పాండు.

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహణ.

సంగారెడ్డి, ప్రతినిధి అక్టోబర్ 29(ప్రజా కలం): యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ లోని ఆడిటోరియం లో జిల్లా స్థాయి యువజనోత్స వాలను ఘనంగా ఉత్సాహ భరితంగా జరిగాయి . ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో సుమారు 400 మంది యువ కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్వామి వివేకానందుడు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం,



దేశభక్తిని పెంపొందించేందుకు చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వివేకానందుడు 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో అమెరికా సోదరీమణులారా, సోదరులారా అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. యువత తమలోని ప్రతిభను వెలికితీసి, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. యువజనోత్సవాలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వార యువతలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. స్వామి వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, సమాజ సేవతో పాటు దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గేయం, వీధి నాటకం, తదితర కళాంశాల్లో పోటీలు నిర్వహించారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ ప్రథమ స్థానం పొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు.వచ్చే జనవరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి సంబంధిత అధికారులు, యువ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కి కాంగ్రెస్ కార్యకర్తలు

-రాహుల్ సభకు సంగారెడ్డి నుంచి ఢిల్లీ బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 29(ప్రజా కలం): నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరారు. సంగారెడ్డి ఐబీ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. సదాశివపేట మండలం నుంచి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిపి మొత్తం 46 మంది బయలుదేరారు. కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిలతో కలిపి 26 మంది ఢిల్లీ పయనమయ్యారు. నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.





పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి- జక్కినగేష్

బీబీనగర్, అక్టోబరు 29 (ప్రజాకలం):

రానున్న వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కినగేష్ కోరారు. గురువారం మండలంలోని రాఘవాపురంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 అక్టోబరు 31 నాటికి లేదా అంతకుముందు డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. విద్యావంతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నవంబరు 6వ తేదీ వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ లేదా మార్కుల జాబితా, పాస్‌పోర్టు సైజు ఫోటో, సెల్‌ఫోన్ నంబరు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులందరూ నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు రాఘవేందర్‌గౌడ్, పదో వార్డు సభ్యులు గుంటిమీది విజయ రవీందర్, టంటం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

వలిగొండ అక్టోబర్ 29 ప్రజాకలం:ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో



ఓపి సేవలకు సంబంధించిన రిజిస్టర్ ను పరిశీలించారు.ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది,హాజరు రోగుల నమోదు,తదితర అంశాలను పరిశీలించారు. 14 ఏళ్ల బాలికలకు,హెచ్ పీవీ టీకాలు పొందిన బాలికల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ల్యాబ్ లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు,సేకరించిన నమూనాలను,తదుపరి పరీక్షల కోసం ఎక్కడికి పంపిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంతాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,వైద్య సిబ్బందిని ఆదేశించారు.గర్భిణీలు, శిశువులు,ఇతర రోగులకు నిరంతర వైద్య సేవలు అందించాలని,కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

-దాసరి పాండు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

బొమ్మలరామారం,అక్టోబర్ 29 (ప్రజా కలం)

మండలంలోని చీకటిమామిడి గ్రామం నుండి వడపర్తి వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సిపిఎం పార్టీ మర్యాల గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున రాస్తారోకో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పడమే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు అని అన్నారు రెండున్నర సంవత్సరాలు అవుతున్న రోడ్డు పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు రోడ్డు వెంట వెళ్తున్న ప్రయాణికులకు దుమ్ము, దూళి రావడంతో కళ్ళు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు రోడ్డు గుంతల మయం కావడంతో వాహనదారులు కిందపడి అనేక ప్రమాదాలు జరగడంతో కాళ్లు,చేతులు విరి గాయని అన్నారు అసంపూర్తిగా ఉన్న రోడ్డు వలన అనేకమంది ప్రయాణికులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు స్థానికంగా ఉన్న అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం,ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని ప్రజలు అనేకసార్లు రోడ్లమీద నిలబడి రాస్తారోకో చేసిన,ఆందోళన చేసిన అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన ఇప్పటివరకు వారం రోజుల్లో నెల రోజుల్లో పూర్తయితుంది అని చెబుతూ కాలయాపన చేస్తున్నారని అన్నారు ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చిత్తశుద్ధితో రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం,సిపిఎం పార్టీ మర్యాల గ్రామ శాఖ కార్యదర్శి ముద్దం మధుసూదన్ రెడ్డి,నాయకులు దేశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



రుద్రవెల్లి వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి

-12 ఏళ్లుగా అసంపూర్తిగానే రుద్రవెల్లి వంతెన
-30 రోజుల్లో పనులు ప్రారంభించాలి
- లేదంటే జాతీయ రహదారి దిగ్బంధం
- బీజేపీ హెచ్చరిక



బీబీనగర్,అక్టోబరు 29 (ప్రజాకలం): రుద్రవెల్లి వంతెన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ భాజపా మండల శాఖ, అధ్యక్షుడు భువనగిరి సదానందంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం వంతెన వద్ద మహాధర్నా నిర్వహించారు. భాజపా నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు వంతెన వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. వర్షాకాలంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినప్పుడు మూసీ నది ఉద్ధృతంగా ప్రవహించి వంతెన మునిగిపోతోందని తెలిపారు. దీంతో బీబీనగర్--భూదాన్‌పోచంపల్లి మార్గంలో ప్రయాణించే సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వంతెనపై నీరు ప్రవహిస్తున్న సమయంలో పోలీసులు రాకపోకలను నిలిపివేయడంతో ప్రజలు చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తోందన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లేవారు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వంతెన సమస్యకు పరిష్కారంగా ఎత్తైన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి నప్పటికీ, 12 ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తి కాలేదని భాజపా నాయకులు విమర్శించారు. పనులు పిల్లర్ల దశకే పరిమితం కావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రుద్రవెల్లి వంతెన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆ హామీని నెరవేర్చాలని నాయకులు కోరారు. ప్రజా సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి మరో 30 రోజుల్లో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని భాజపా నాయకులు స్పష్టం చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ధర్నా సందర్భంగా వంతెనపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ, ఏలే చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోయపల్లి గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు నరోత్తం రెడ్డి, జిల్లా నాయకులు ఇంజమూరి ప్రభాకర్, పసలాది రామ్‌చందర్, దయ్యాల కుమార్, నిమ్మల శివ, రాంపల్లి రేణుక, మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

ఎల్‌నినో ప్రభావం కారణంగా రెండో పంట సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి--ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

బొమ్మలరామారం,అక్టోబర్ 29 (ప్రజా కలం)

రెండో పంట సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మండల రైతులకు సూచించారు. బొమ్మలరామారం మండలం, మర్యాల,చౌదర్ పల్లి గ్రామంలో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం రోజున ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో రెండో వరి పంట సాగులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలన్నారు.

అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని సూచించారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ,మండల తాహసిల్దార్ రాధ, మండల వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి, ఏఈఓ మౌనిక,సింగిల్ విండో చైర్మన్ సింగర్తి మల్లేష్,రాజేష్ పైలెట్,ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్,సింగిల్ విండో డైరెక్టర్లు,ఆత్మ కమిటీ డైరెక్టర్లు,మహిళా అధ్యక్షురాలు యంజాల కళ,పడమటి పావని,తిరుమల కవిత, శ్రీరాములు నాయక్, రాజమల్లారెడ్డి,ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు మైలారం సుదర్శన్,భగవంత్ రెడ్డి,ధనవత్ సునీత, సంగీత,ఎడమ పుష్ప,స్వప్న, సర్పంచులు గణేష్,రాములు, శంకరయ్య, వెంకటేష్, శ్రీను నాయక్, పావని, అద్దమడుగు బాలకృష్ణ,గుండెబోయిన కుమార్,మహిళ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టూ అమూల్యమే: రవీందర్ ముదిరాజ్



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నీటి విలువను గుర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సమాజానికి కనువిప్పు కలిగించేలా పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాలనే సందేశంతో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని సూరారం ప్రాంతంలో కోలా రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నార్త్ సిటీ పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. నీటిని వృథా చేయరాదంటూ నినాదాలు చేస్తూ సూరారం ఎక్స్‌రోడ్డు వరకు సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన కల్పించింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీరు లేని భవిష్యత్తును ఊహించడమే భయానకమని...ఇప్పటికైనా నీటి పొదుపును ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. బంధువులు, అతిథులు వచ్చినప్పుడు అవసరానికి మించి నీటిని గ్లాసుల్లో పోసి వృథా చేయకుండా చిన్న గ్లాసుల్లో అందించాలని కోరారు. స్నానం చేసేటప్పుడు నీటిని పరిమితంగా వినియోగించాలని, వృథా నీరు కాలువల్లోకి వెళ్లకుండా సాధ్యమైనంతవరకు పునర్వినియోగంపై దృష్టి సారించాలని కోరారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇంకుడు గుంతల ఏర్పాటును ప్రోత్సహించేలా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, బోర్లు వేసే ముందు వర్షపు నీటి ఇంకుడు గుంత ఉండేలా చూడాలని కోరారు. బోరు వేస్తున్న సమయంలో బయటకు వచ్చే నీరు వృథాగా ప్రవహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు గుంతలను తప్పనిసరి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, నిబంధనలకు అనుగుణంగా ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాల మంజూరులోనూ వర్షపు నీటి సంరక్షణ ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులే కీలకం

-కుటుంబ సభ్యులకు పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి
- జిల్లా ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి వీణా

బీబీనగర్,అక్టోబరు 29 (ప్రజాకలం): పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని జిల్లా ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి వీణా పిలుపునిచ్చారు. మండలంలోని భట్టుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె



విద్యార్థులకు పొగాకు వినియోగంతో కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరమని, వీటివల్ల క్యాన్సర్‌తో పాటు పలు ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వీణా తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, పరిసర ప్రాంతాల ప్రజలకు పొగాకు దుష్ప్రభావాలను వివరించి, వాటికి దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలని, పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి మౌనిక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దివాకర్ యాదవ్, ఆరోగ్య సహాయకుడు ఇస్తారి, పర్యవేక్షకులు పద్మజ, శాంత, ఏఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్త భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సిఎంసి కమిషనర్ ఆదేశం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్: గాజులరామారం సర్కిల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి.సృజన, జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. మల్లారెడ్డి ఆసుపత్రి నుంచి పెద్ద చెరువు వరకు నిర్మిస్తున్న వరదనీటి కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గాజులరామారం నుంచి మహాదేవపురం జంక్షన్ వరకు రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని, మహాదేవపురం నుంచి సిక్కుల బస్తీ వరకు సీసీ రోడ్డు పనులను వేగవంతం చేయాలని సూచించారు. రహదారి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం మహాదేవపురంలోని జంతు సంరక్షణ కేంద్రం వద్ద పశు వైద్య విభాగానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. భూమి హద్దులను గుర్తించి, ఆక్రమణలకు తావులేకుండా ప్రహరీ నిర్మించాలని సూచించారు. అభివృద్ధి పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఉప కమిషనర్ వెంకట్ రాములు, ఇంజినీరింగ్ అధికారులు గోవర్ధన్ గౌడ్, నిఖిల్ రెడ్డి, మహదేవ్ అనురాగ్, సుమిత్ర, లావణ్య, మేనేజర్ విజయరాణి, మండల సర్వేయర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లి గ్రామం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

- 50 మందికి కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి





మహేశ్వరం నియోజకవర్గం, అక్టోబర్ 29, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె సమక్షంలో బాచుపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన దొడ్డ పావని కీర్తి కుమార్ రెడ్డి, వార్డు సభ్యులు ఎర్ర మానస శ్రీనివాస్, ఎర్ర ప్రమీల ప్రభులితో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలకు సబితా ఇంద్రారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

తన సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇంతటి వైఫల్యాలను ఎదుర్కొంటున్న ప్రభుత్వాన్ని చూడలేదని అన్నారు. సాధారణంగా అధికార పార్టీలోకి ఇతర పార్టీల నాయకులు చేరుతుంటారని, అయితే తెలంగాణలో ఇందుకు భిన్నంగా ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోకి రాష్ట్రవ్యాప్తంగా చేరికలు కొనసాగుతున్నాయని అన్నారు.

ఫ్యూచర్ సిటీ పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచ గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌నినోను సాకుగా చూపుతూ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తన నియోజకవర్గంలో సుమారు రూ. 40 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు విడుదల కాకపోతే 30 వేల మందితో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ప్రకటించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ మార్కెట్ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, నేదునూరు సర్పంచ్ కాసుల రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నసాగర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌పై హరీష్‌రావు ఆందోళన

- అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారని ఆరోపణ

- దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన మాజీ మంత్రి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తానని వెల్లడి

గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం తిప్పారం గ్రామ సమీపంలో మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట కింద పైప్‌లైన్ నిర్మాణం కోసం చేపడుతున్న బ్లాస్టింగ్ పనులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీష్‌రావు పరిశీలించారు. బ్లాస్టింగ్ ప్రభావంతో దెబ్బతిన్నాయని చెబుతున్న ఇళ్లను పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. రిజర్వాయర్ కట్టకు సుమారు 200 మీటర్ల దూరంలో బ్లాస్టింగ్ పనులు చేపడుతున్నారని,వాటి ప్రభావంతో ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేసినట్లు హరీష్‌రావు తెలిపారు. బ్లాస్టింగ్



కారణంగా రిజర్వాయర్ కట్ట భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నారనే ఆరోపణలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ పరిసరాల సుందరీకరణకు నీటిని తరలించేందుకు చేపడుతున్న పైప్‌లైన్ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ చేస్తున్నట్లు పేర్కొన్న హరీష్‌రావు.. పనులకు సంబంధించిన అనుమతులు,భద్రతా ప్రమాణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పైప్‌లైన్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులో అన్యాయం జరిగిందని హరీష్‌రావు ఆరోపించారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, బ్లాస్టింగ్‌తో ఇళ్లు దెబ్బతిన్న వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పనులు చేపట్టిన సంస్థపై విచారణ జరిపి,అక్రమాలు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తానని హరీష్‌రావు వెల్లడించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ భద్రతతోపాటు గ్రామస్తుల ఆస్తుల రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి,ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బక్కి వెంకయ్య, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్ రెడ్డి,ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- షీ టీమ్ అవగాహన కార్యక్రమంలో సీపీ రష్మి పెరుమాళ్



గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి):

విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపై దృష్టి సారించాలని,చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్,ఐపీఎస్ సూచించారు. గురువారం గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన షీ టీమ్ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో నేరప్రవృత్తిని నివారించడం, రహదారి భద్రత,మహిళల రక్షణ,సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇటీవల నిర్వహించిన క్రైమ్ రివ్యూలో మైనర్లు నేరాలకు పాల్పడుతున్న ఘటనలపై ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు లభిస్తున్న విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

మైనర్లు వాహనాలు నడపడం,ట్రిపుల్ రైడింగ్ చేయడం ప్రమాదకరమని సీపీ హెచ్చరించారు. 12, 13 ఏళ్ల వయసులోనే పిల్లలు వాహనాలు నడుపుతూ బయటకు వెళ్తున్నారని కొందరు తల్లిదండ్రులు గర్వపడుతున్నారని,అయితే ప్రమాదాలు జరిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. తాత్కాలిక ఆకర్షణలకు లోనై చెడు మార్గాల్లోకి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు. "ఈ సమయాన్ని వృథా చేసుకోకండి..ఈ సమయం మళ్లీ తిరిగి రాదు''అని పేర్కొంటూ, ప్రతి నిమిషం విలువైనదని గుర్తించి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్ లేదా ఇతర వస్తువులు కొనివ్వలేదనే కారణంతో కొందరు విద్యార్థులు తీవ్ర నిర్ణయాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని సీపీ అన్నారు.

జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని,మానసిక బలాన్ని పెంపొం దించుకోవాలని సూచించారు. నమన్యలను మనసులో దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలని తెలిపారు. తన విద్యార్థి జీవితంలో ఎదురైన అనుభవాలను, ఉపాధ్యాయులు అందించిన ప్రేరణను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పులకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

మహిళలను గౌరవించాలి.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాలపై పురుషులు కూడా అవగాహన కలిగి ఉండాలని సీపీ సూచించారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ,లింగ వివక్షకు తావులేకుండా సమానత్వాన్ని పాటించాలని కోరారు. మహిళలకు భద్రతతో కూడిన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా చేపడుతున్న 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులను క్లిక్ చేయడం,వ్యక్తిగత వివరాలు,బ్యాంకింగ్ సమాచారం, ఓటీపీలు ఇతరులతో పంచుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు ఆరోగ్యం, కుటుంబం,సామాజిక జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీపీ హెచ్చరించారు. వాటికి అలవాటుపడిన వారికి డీ-అడిక్షన్ చికిత్స,కౌన్సెలింగ్ అందించడం ద్వారా సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు లేదా వాటికి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు,గజ్వేల్ ఎస్‌హెచ్ఓ రవికుమార్,సీఐలు రవిరాజు,లతీఫ్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ దుర్గ, సుజాత డిగ్రీ కళాశాల లెక్చరర్, శ్వేత మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు,షీ టీమ్ సభ్యులు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

20 ఏళ్లుగా సేవలు.ఇంకా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూపులే

-78 కేడర్ల ఉద్యోగులకు న్యాయం చేయాలి: తుమ్మ శ్రీనివాస్

గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిధిలో 20 ఏళ్లకు పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు తుమ్మ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించడంతో పాటు,మాతా శిశు సంరక్షణ,కంటి వెలుగు,టీబీ నిర్మూలన, ఆరోగ్య మహిళ వంటి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం,వేతనాల చెల్లింపుల్లో సమస్యలు ఎదురవడం విచారకరమన్నారు. ఎన్‌హెచ్ఎం పరిధిలోని 78 కేడర్ల సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని కోరారు. అప్పటివరకు సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా ఐదో తేదీలోపు జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏటా 5 శాతం ఇంక్రిమెంట్,8 శాతం లాయల్టీ బోనస్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల వ్యవస్థను రద్దు చేసి,ఉద్యోగులను నేరుగా స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలో కొనసాగించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయడంతో పాటు,విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి,కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక సేవలందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలని తుమ్మ శ్రీనివాస్ కోరారు.

ఘనంగా కిసాన్ మహారాజ్ అవార్డులు

ఉత్తమ రైతులకు సత్కారం.. 50 మందికి నగదు పురస్కారాలు



హైదరాబాద్, అక్టోబరు 29 (ప్రజాకలం) : హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో మైవిలేజ్ సొల్యూషన్స్ లిమిటెడ్, వైజ్ టీవీ సహకారంతో ప్రతిష్ఠాత్మక "కిసాన్ మహారాజ్ అవార్డ్స్ -- 2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీజేపీ చీఫ్ రామచంద్రరావు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, బండి రమేష్ తదితరులతో పాటు వివిధ ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు, ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులు, రైతులు, అవార్డు గ్రహీతలు హాజరయ్యారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు విశేష సేవలందిస్తున్న రైతులను గుర్తించి, వారి కృషిని గౌరవించేందుకు ఈ అవార్డులను అందజేశారు. రైతుల విజయగాథలను, వ్యవసాయ రంగానికి వారు అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఇతర రైతులకు ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ పద్ధతుల వినియోగం కీలకంగా మారిందని కార్యక్రమంలో పేర్కొన్నారు. నీటి వినియోగాన్ని తగ్గించే విధానాలు, ప్రకృతి ఆధారిత ఎరువుల వినియోగం, డ్రిప్ ఇరిగేషన్, డ్రోన్ల వినియోగం వంటి ఆధునిక పద్ధతులు వ్యవసాయ రంగంలో అనేక మార్పులకు దోహదపడుతున్నాయని తెలిపారు.

పంటల ఎంపిక, సాగు విధానాల్లో మార్పులతో దీర్ఘకాలిక సమన్యలను నియంత్రించడంతో పాటు, ఉత్పాదకతను పెంచుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆధునిక, వినూత్న వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ ముందంజలో ఉన్న సుమారు 50 మంది రైతులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. 5,000 నగదు చెక్కు, షీల్డ్‌తో పాటు ఘన సత్కారం అందజేశారు. రైతుల కృషిని గుర్తించి గౌరవించడం ద్వారా వ్యవసాయ రంగంలో మరింత నూతన ఆలోచనలు, ఆధునిక పద్ధతుల వైపు రైతులను ప్రోత్సహించడమే కిసాన్ మహారాజ్ అవార్డ్స్ -- 2026 ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com